Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 213 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 ఆగస్టు 2023 బుధవారం పేజీలు : 4

## హరిత పథకంలో 'కొండరైలు'

చెన్నై : కేంద్రప్రభుత్వ హరిత రైళ్ల పథకం కింద నీలగిరి కొండ రైలును హైడ్రోజన్ ఇంధనంతో నడపనున్నట్లు సేలం డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. నీలగిరి జిల్లా ఊటీ కొండ రైలులో ప్రయాణిం చేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. మేట్టుపాళయం – కున్నూరు మధ్య మీటర్‌గేజీ మార్గంలో 'ఎక్స్ క్లాస్' ఇంజన్‌తో 15 కిలోమీటర్ల వేగంతో నడిచే ఈ రైలులో పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ వెళ్లడం దీని ప్రత్యేకత. ఈ రైలు నడిపేందు కు ప్రస్తుతం బర్నస్ ఆయిల్, డీజిల్ ఇంజిన్లు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రోజన్‌తో పని చేసేలా 8 ప్రాంతాల్లో 35 రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ నిర్వహించింది. అందులో ఊటీ – మేట్టుపాళయం, డార్జిలింగ్ – హిమాచల్ సహా 8 సంప్రదాయ రైళ్లను హరిత రైలు పథకంలో చేర్చింది.






# ప్రధాన ఘట్టం పూర్తయ్యింది

# ఇక ప్రచారమే మిగిలింది

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సోమవారం 115 మందితో కూడిన జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో దాదాపు సిట్టింగ్ లందరికీ సీటు కేటాయించారు. అటు కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాబితా విడుదల చేయగాయనే రాష్ట్రంలో ఎన్నికల వేడి ప్రారంభమైంది.

మిగతా పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. బీఆర్ఎస్ జాబితా బయటకు రావడంతో ఇక అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టారు. ప్రకటించిన అభ్యర్థుల్లో దాదాపు అందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండడంతో వారు ప్రచారం చేసుకోవడానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యేల హోదాలో పర్యటిస్తూ ప్రజల ఆకట్టుకుంటున్నారు. అయితే కొన్ని చోట్ల వారికి చేదు అనుభవం ఎదురువుతోంది. చాలా మంది డబల్ బెడ్ రూమ్ లపై ప్రశ్నిస్తున్నారు. అలాగే దళిత బంధుపై నిలదీస్తున్నారు. చాలా మంది బీఆర్ఎస్ అభ్యర్థులు పకడ్బందీగా ప్రచారం చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరితై 100 మంది ఓటర్లకు ఒక సమన్వయకర్తను నియమించుకున్నారు.

ప్రచారంలో భాగంగా రుణమాఫీ, పింఛన్, కల్యాణ లక్ష్మి, దళిత బంధు, బీసీలకు లక్ష రూపాయల సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళు న్నారు. సోమవారం ప్రకటించిన జాబితాలో కొంత మంది సిట్టింగ్ లకు చోటు లభించలేదు. వారిలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్, కామారెడ్డి గంప గోవర్దన్, ఉప్పల్, వైరా సిట్టింగ్ లకు టికెట్ కేటాయించలేదు. జనగామ, నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. బీఆర్ఎస్ ఎన్నికల తేదీలు రాక ముందే అభ్యర్థులను ప్రకటించడంతో ఆ పార్టీ అభ్యర్థులకు ప్రచారం చేసుకునేందుకు చాలా సమయం దొరుకుతుంది. ఎన్నికలకు ఇంకా రెండున్నర నెలల సమయం ఉండడంతో ఆలోపు ప్రజల్లోకి వెళ్లాలని బీఆర్ఎస్ అభ్యర్థులు భావిస్తున్నారు. అయితే చాలా చోట్ల ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

కానీ సీఎం కేసీఆర్ సర్వే ఆధారంగానే టికెట్లు ఇచ్చిన పార్టీశ్రేణులు చర్చించుకుంటున్నాయి.

# రేసులో ముందున్న కారు...




హైదరాబాద్ : మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుపై వేటుకు రంగం సిద్ధమవుతోంది. మైనంపల్లి వ్యాఖ్యల కు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేస్తున్నాయి. మైనంపల్లి దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నాయి. మైనంపల్లిపై సొంత పార్టీ నేతలు మండి పడుతున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ పెరుగుతోంది.

ఇప్పటికే మైనంపల్లి వ్యాఖ్యలను కేటీఆర్, కవిత ఖండించారు. ఈ క్రమంలోనే ఆయనపై వేటుకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. నిన్న బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా వెలువడటానికి ముందే తన కుమారుడు రోహిత్‌కు టికెట్ ఇస్తే సరి.. లేదంటే ఊరుకోబోనంటూ సంచలనానికి మైనంపల్లి తెరదీశారు. అంతటితో ఆగక మంత్రి హరీష్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు బట్టలు ఊడతీసే వరకు నిద్రపోనన్నారు. సిద్దిపేటలో హరీష్ రావు అడ్రస్ గల్లంతు చేస్తానన్నారు. రాజకీయంగా ఎంతో మందిని అణిచివేశాడని.. అక్రమంగా లక్షల కోట్లు సంపాదించారని ఆరోపణలు చేశారు. సిద్ధిపేటలో హరీష్ రావు అడ్రస్ గల్లంతు చేస్తానని హెచ్చరించారు. హరీష్ రావు తన నియోజక వర్గాన్ని వదిలేసి తమ జిల్లాలో ఎందుకు పెత్తనం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ఆయనపై టీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు.




కామారెడ్డి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఈసారి స్వయంగా సీఎం కేసీఆరే బరిలో ఉండనున్నారు. జిల్లాలోని మరో మూడు నియోజక వర్గాల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్ కేటాయిస్తూ కేసీఆర్ ప్రకటించారు. కేసీఆర్ ప్రకటించిన టికెట్ల జాబితాలో గంప గోవర్ధన్‌కు చోటు దక్కలేదు. ఆ స్థానంలో కేసీఆర్ పోటీ చేయనున్నారు.

దీంతో జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి టికెట్లు దక్కుతాయోననే దానిపై ఉత్కంఠకు తెర దింపారు. ముందస్తుగానే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. బాన్సువాడ,ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు దక్కడంతో ఆ పార్టీ శ్రేణులు, ఆ ఎమ్మెల్యేల అనుచరులు సంబరాల్లో మునిగితేలారు. కామారెడ్డిలో కేసీఆర్ పోటీచేయడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో పాటు ముఖ్యనేతలు స్వాగతించారు. పార్టీ శ్రేణులు సైతం సంబరాలు జరుపుకున్నారు.

**ఉమ్మడి నిజామాబాద్‌ను క్లీన్ స్వీప్ చేసేందుకే..** జాతీయ రాజకీయాల్లో రాణించేందుకు కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. అయితే రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో మరింత రాణించేందుకే కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గాన్ని టార్గెట్ చేసినట్లు ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. దీంతో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ మరింత బలం పెంచుకునేందుకే కామారెడ్డి నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాల్లో ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని సీఎం కేసీఆర్ సర్వేలో వెల్లడైనట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో కామారెడ్డి నుంచి పోటీ చేస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను క్లీన్ స్వీప్ చేయవచ్చనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లోనూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా కేసీఆర్ బరిలో ఉంటే నాలుగు ఎంపీ సీట్లయిన నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ ప్రభావితం చూపవచ్చనే భావనలో కేసీఆర్ ఉన్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇలా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నేపథ్యంలోనే కామారెడ్డి నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది.

## కేసీఆర్ కామారెడ్డిని ఎంచుకోవడానికి కారణం ఏంటో ఎట్టకేలకు తెలిసింది..!

**కామారెడ్డిలో కేసీఆర్ :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పదోసారి గజ్వేల్ నియోజకవర్గంతో పాటు కామారెడ్డి నియోజకవర్గంలోనూ పోటీచేయనున్నారు. 1983లో మొదటిసారిగా సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1985లో సిద్దిపేట నియోజకవర్గం నుంచే పోటీచేసి గెలిపొందగా అప్పటినుంచి కేసీఆర్ ఓటమినే ఎరగలేదు. వరుసగా సిద్దిపేట నియోజకవర్గం నుంచే 1989,1995,1999 ఎన్నికల్లో గెలుపొందారు. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించిన తర్వాత రాజీనామా చేసిన ఉప ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచే గెలుపొందారు. 2004 ఎన్నికల్లోను సిద్దిపేట నుంచే గెలుపొందారు. 2006లో కరీంనగర్ ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 2008లోనూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మహబూబ్‌నగర్ ఎంపీగా గెలుపొందారు. 2014లోను గజ్వేల్ నుంచి పోటీ చేసి సీఎం అయ్యారు. 2018లోను అక్కడి నుంచే పోటీ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నియోజకవర్గంలోను కేసీఆర్ పోటిచేయనున్నారు.

**కేసీఆర్ సామాజికవర్గం అంతంతే..** కామారెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్‌కు చెందిన సామాజిక వర్గం అంతంతమాత్రంగానే ఉంది. ఇక్కడ వెల్మ ఓట్లు సుమారు 2 వేల వరకు మాత్రమే ఉన్నాయి. నియోజకవర్గంలో ఎక్కువగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన 31 వేలకు పైగా ఓట్లు ఉన్నాయి. తర్వాత మైనార్టీ ఓట్లు 28 వేలు, మున్నూ రు కాపు ఓట్లు 16 వేలు, వైశ్యులవి 16 వేలు, ఆర్య క్షత్రియులవి 2 వేల ఓట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,27,807 ఉండగా ఇందులో పురుషులవి 1,10,056 ఓట్లు ఉన్నాయి. మహిళలవి 1,17,787, థర్డ్ జండర్‌వి 28 ఉన్నాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గంప గోవర్ధన్ 4557 ఓట్ల మెజార్టీతో గెలిపొందారు. అప్పటి ఎన్నికల్లో 1,62,231 ఓట్లు పోల్ కాగా బీఆర్ఎస్ నుంచి గంపగోవర్ధన్‌కు 68,167 ఓట్లు పోలయ్యాయి. రెండో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీకి 63,610 ఓట్లు వచ్చాయి.

# తెలంగాణలో బీజేపీ అదిరిపోయే స్కెచ్

ఢిల్లీ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ అధిష్టానం ఫోకస్ పెట్టింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల జాబితాను ప్రకటించాలనుకుంటుంది. ఇటీవల ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్ అభ్యర్థుల తొలిజాబితాను అధిష్టానం ప్రకటించింది. మరో వారం, పది రోజుల్లో తెలంగాణ , రాజస్థాన్ అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేయనుంది. అయితే ఈసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు గణనీయమైన సీట్లు కేటాయించాలనుకుంటున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. నార్మల్‌గా ఈసారి ఎన్నికల బరిలోకి వెళితే తెలంగాణ సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టం. అందుకే ఈసారి పూర్తి భిన్నమైన వ్యూహాలను అనుసరించాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది.

**ఆ స్థానాల్లోనే దిగ్గజాల పర్యటనలు..** మొత్తం 119 అసెంబ్లీ స్థానాలను ఏ, బి, సి అనే మూడు కేటగిరీలుగా విభజించనుంది. మొదటి కేటగిరీలో ఇప్పటి వరకూ గెలిచిన స్థానాలు, రెండో కేటగిరీలో గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన స్థానాలు, మూడో కేటగిరిలో ఇప్పటివరకూ గెలవని స్థానాలను ఉంచబోతున్నారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో వచ్చిన స్థానాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని.. ఈ స్థానాల్లోనే ప్రధాని మోదీ, అమిత్ షా వంటి దిగ్గజాల పర్యటనలు ఉండేలా చూసుకోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఈ మూడు కేటగిరీలకు సంబంధించిన జాబితా ఇవ్వాలని రాష్ట్ర బీజేపీని అధిష్టానం అడిగినట్లు సమాచారం. అది అందిన వెంటనే బీజేపీ సెంట్రల్ ఎన్నికల కమిటీ భేటీలో అభ్యర్థుల జాబితాను ఖరారు చేయనున్నారు.

**బీఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టేందుకు..** అయితే ఈసారి మహిళలకు అధిక స్థానాలను కేటాయించాలని కూడా అధిష్టానం యోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. 33 శాతం మహిళా రిజర్వేషన్ ను తెరపైకి తెచ్చిన కవితకు, బీఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టేందుకు అధిక స్థానాలను మహిళలకు కేటాయించాలని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఈసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి కూడా తొలిసారి అసెంబ్లీ బరిలో నివాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. అంబర్ పేట లేదా ముషీరాబాద్ నుంచి ఆమె పోటీచేసే అవకాశాలున్నట్లు జోరుగా ప్రచారం కూడా జరుగుతోంది. ఆమెతో పాటు హర్యానా గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి సైతం సికింద్రాబాద్ లేదంటే సనత్ నగర్ నుంచి పోటీచేయాలనుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు బీజేపీ అధిష్టానానికి దత్తాత్రేయ విజ్ఞప్తి కూడా చేసినట్లు సమాచారం.

**ఈసారి ఎన్నికల్లో వారికే అవకాశం..** బీజేపీలోని ప్రముఖుల కుటుంబాలకు చెందిన మహిళలకు ఈసారి ఎన్నికల్లో అవకాశం దక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణ, విజయశాంతి, జయసుధ, హైదరాబాద్ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, జూబ్లీహిల్స్ జూలూరు కీర్తిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తిలకు దాదాపు సీట్లు ఖరారు అయినట్లు సమాచారం. ఇబ్రహీం పట్నం నుంచి రాణి రుద్రమ, సనత్ నగర్ నుంచి ఆకుల విజయ, శ్రీవాణి, డాక్టర్ వీరపనేని పద్మ తదితరులు కూడా ఈ సారి అసెంబ్లీ స్థానాలు ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

**రాజ్యసభకు కిషన్ రెడ్డి? :** తన సతీమణి కావ్యకు అధిష్టానం అసెంబ్లీ స్థానాన్ని కేటాయిస్తే కిషన్ రెడ్డి రాజ్యసభకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల తరువాత జరిగే లోక్ సభ ఎన్నికల్లో కూడా పోటీచేసే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీని ముందుండి నడిపించాలంటే కిషన్ రెడ్డి పోటీ నుంచి తప్పుకోవడం మంచిదని కొంతమంది చెబుతుంటే అసలు ఆయన పోటీచేయకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెబుతున్నవారు కూడా ఉన్నారు. 2024 తరువాత బీజేపీ జాతీయ అధ్యక్షునిగా కూడా కిషన్ రెడ్డి పేరు గట్టిగానే వినిపిస్తోంది. జేపీ నడ్డా రిటైర్ అయిన తరువాత కిషన్ రెడ్డి కేంద్రంలో మకాం వేయడానికే మొగ్గు చూపుతున్నారని, ఆ వ్యూహంలో భాగంగానే తన భార్య పేరును తెరపైకి తెచ్చారని ఆయన అనుచరులు చెబుతున్నారు. మరి అధిష్టానం మదిలో ఏముందో తెలియాలంటే మరో వారం, పదిరోజులు ఆగాల్సిందే.



## సంపాదకీయం

# మోడీజీ పెట్టిన నిప్పు ఆ పార్టీలో ఇంకా ఆరలేదు!

విలక్షణ రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాడులో అన్నాడీఎంకే అధినేత్రి అప్పటి ముఖ్యమంత్రి జయలలిత మరణించాక అధికారం కోసం జయ నమ్మిన బంటు పన్నీర్ సెల్వం జయ నెచ్చెలి శశికళ మధ్య ఫైట్ నడిచిన సంగతి తెలిసిందే. సందట్లో సడేమియాలా గోతి కాడ నక్కలాగా ఈ వివాదంలో తాను లాభపడటానికి వీలుంటే పన్నీర్ సెల్వంకు మద్ధతిచ్చే ఎమ్మెల్యేలందరినీ బీజేపీలోకి లాగేసి బీజేపీ ప్రభుత్వాన్ని తమిళనాడులో ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కలలు కన్నారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శశికళను అక్రమాస్తుల కేసులో జైలుకు పంపారని విమర్శలు ఉన్నాయి. అయితే శశికళ జైలుకు వెళ్లినా తన అనుంగు సహచరుడు పళనిస్వామి సీఎం అయ్యేలా చక్రంతిప్పారు. అయితే ఆ తర్వాత పరిణామాలతో పన్నీరు సెల్వం పళనిస్వామిల మధ్య బీజేపీ అధిష్టానం రాజీ ఫార్ములా తెచ్చి కలిపిందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగా పళనిస్వామి సీఎంగా పన్నీరు సెల్వం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అలాగే పార్టీకి పన్నీరు సెల్వం కన్వీనర్ గా పళనిస్వామి కోకన్వీన ర్ గా ఉండేలా ఒప్పందం కుదిర్చారని మీడియా సంస్థలు నాడు తెలిపాయి. అయితే గతేడాది జరిగిన తమిళనాడు ఎన్నికల్లో అన్నాడీఎంకే పరాజయం పాలై డీఎంకే అధికారం లోకి వచ్చింది. దీంతో స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. అధికారం లేకపోవడంతో పార్టీపై పెత్తనం కోసం మళ్లీ పళనిస్వామి పన్నీర్ సెల్వం మధ్య ఆధిపత్య పోరు రాజుకుంది. ఇందులో భాగంగా ఎక్కువ మంది ఎమ్మెల్యేలు జిల్లాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పళినిస్వామికే జై కొట్టారు. దీంతో పన్నీరు సెల్వాన్ని ఆయన కుమారుడు (ఎంపీ)తోపాటు పలువురిని పళనిస్వామి పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చెస్ ఒలంపియాడ్ ప్రారంభోత్సవం కోసం జూలై 27న చైన్నైకు రానున్నారు. దీంతో నరేంద్ర మోదీతో భేటీ అయ్యేందుకు అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) బహిష్కృత నేత ఒ.పన్నీర్సెల్వం (ఓపీఎస్) ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ మేరకు వారు మోదీ అపాయింట్మెంట్ కోసం ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారని సమాచారం. అన్నాడీఎంకేలో నెలకొన్న సంక్షోభం దానిని అధిగమించి తాను బయటపడిన వైనం గురించి తెలియజేయడంతో పాటు తనకే ఆశీస్సులివ్వాలని మోదీని అభ్యర్థించేందుకు ఈపీఎస్ సిద్ధమైనట్లు తెలిసింది. మరోవైపు ద్వంద్వ నాయకత్వం కోసం కృషి చేసిన తనను పార్టీ నుంచి గెంటేసిన తీరును ఈపీఎస్ పోకడల్ని ఏకరువు పెట్టుకునేందుకు ఓపీఎస్ కూడా మోదీని కలవాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి మోదీ వీరిద్దరితోనూ సన్నిహితంగానే ఉన్నారు. అన్నాడీఎంకే సాధారణ సభ్య సమావేశంలో సమన్వయకర్తగా పన్నీరును తొలగించాక ఆయన ఢిల్లీ వెళ్లారు. ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము నామినేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. అప్పుడు కూడా బీజేపీ నేతలు ఆయన్ని సాదరంగానే ఆహ్వానించారు. అయితే మోదీ అమిత్షాలతో భేటీ కోసం చేసిన ప్రయత్నాలు మాత్రం విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు వీరిద్దరు ప్రధాని మోడీని కలవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి ఎవరు విజయం సాధిస్తారన్నదానిపై రాజకీయవర్గాలు ఉత్కంఠతో గమనిస్తున్నాయి. మరోవైపు సందట్లో సడేమియా అన్నట్టు అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కూడా మోదీని కలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి ఈపీఎస్ ఓపీఎస్ శశికళ దినకరన్ కలిసి వుంటేనే అన్నాడీఎంకేకు భవిష్యత్తు వుందని ముమ్ముందు ఆ పార్టీ మరింత బలపడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు గట్టిగా తలపోస్తున్నారు. ఆ మేరకు ఆయన ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మోదీతో భేటీ అయ్యేందుకు అన్నామలై ద్వారా శశికళ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

# అధికారుల నిర్లక్ష్యం.. దళారులకు లాభం



వేములవాడ: ఒకప్పుడు పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు నేడు వెలవెలబోతోంది. అధికారుల అలసత్వం, మార్కెట్ కమిటీ పాలక వర్గం నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి కొనుగోళ్లు జరగక అలంకారప్రాయంగా మారింది. ఇదే అదనుగా గ్రామాల్లో దళారులు పత్తిని రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించి భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు చేపడితే వ్యాపారుల మధ్య పోటీ ఎక్కువై ధర పెరిగి రైతులకు గిట్టుబాటు అయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. గ్రామాల్లో క్వింటాల్ పత్తికి రూ. 7,500 వరకు దళారులు చెల్లిస్తున్నారు. మరోవైపు కొందరు దళారులు తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి వరంగల్, జమ్మికుంట, ఆదిలాబాద్ ప్రాంతాల్లో క్వింటాల్ పత్తికి రూ. 8,100 వరకు ధర పలుకుతున్నప్పటికీ గ్రామాల్లో మాత్రం దళారులు బాగా తక్కువ ధరకు చెల్లిస్తున్నారు. రోజూ ఈ ప్రాంతం నుంచి అయిదు నుంచి పది వాహనాల్లో భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలి ఎళ్తుంది. ఇందులో కొన్నింటికే మార్కెట్ ఫీజు వసూలు అవుతుందనే ఆరోపణలున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 17,98,240ల ఫీజును వసూలు చేశారు. వేములవాడ మార్కెట్ పరిధిలోని తిప్పాపూర్, కోనాయిపల్లి వద్ద ఉన్న రెండు చెక్ పోస్టుల ద్వారా నామమాత్రపు ఫీజు వసూలు చేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో దళారులు పెద్ద ఎత్తున సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించడంతో మార్కెట్ కమిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది. దీనికి తోడు జిన్నింగ్ మిల్లులకు పత్తి దిగుబడులు రాక మిల్లుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలింపువ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లకు అధికారులు నిర్లక్ష్యం చూపడంతో దళారులకు కాసుల పంట పండుతోంది. ఇదే అదనుగా దళారులు గ్రామాల్లో పత్తిని నిబంధనలకు విరుద్ధంగా సేకరించి సొమ్ము చేసుకుంటున్నా మార్కెట్ కమిటీ అధికారులు మామూలుగా తీసుకొంటున్నారు. మార్కెట్ పరిధిలో 26 మంది లైసెన్స్ వ్యాపారులున్నప్పటికీ యార్డులో మాత్రం కొనుగోళ్లు చేయడం లేదు. జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో పత్తి సాగు కాగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 20,500 క్వింటాళ్లు మాత్రమే జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు జరిగినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. గ్రామాల నుంచి రెండింతల పత్తిని దళారులు ఇతర ప్రాంతాలకు తరలించారని వ్యాపారులు పేర్కొంటున్నారు. బుధవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెట్ పాలక వర్గం వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులతో హడావుడిగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినా యార్డులో పత్తి కొనుగోళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యార్డులో కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులే పత్తిని తీసుకు రావడం లేదని అధికారులు కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్పా సేకరణకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు, పాలకవర్గం యార్డులో పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

రైతులు ముందుకు రావడం లేదు– సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వేములవాడ

మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే విక్రయించేందుకు రైతులు ముందుకు రావడం లేదు. యార్డుకు తీసుకువస్తే రవాణా, హమాలీ వంటి ఛార్జీలవుతున్నాయని గ్రామాల్లోనే విక్రయిస్తున్నారు. గత ఏడాది పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే రెండు రోజులు కూడా రైతులు తీసుకురాలేదు. పత్తిని కొనుగోలు చేసే వ్యాపారులు తక్కువ ఉన్నారు.

# అన్నదాతల కంటతడి



ఖమ్మం : విద్యుత్తు కోతలతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తుందని రైతులు ఆనందంతో యాసంగిలో వరి సాగుకు మొగ్గుచూపారు. నాట్ల ప్రక్రియ పూర్తయ్యిందో.. లేదో విద్యుత్తు కోతలు ప్రారంభమయ్యాయి. పక్షం రోజులుగా సరిపడా నీరందక పైర్లు బీటలు వారుతున్నాయి. కళ్లెదుటే పైర్లు ఎండిపోతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఖమ్మం జిల్లాలో 1.06లక్షలు, భద్రాద్రి కొత్తగూడెంలో 47,978 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో 5గంటల సమయంలో 606 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఏర్పడింది. గతేడాది ఇదే సమయానికి 468మెగావాట్లు మాత్రమే ఉంది. అసాధారణంగా డిమాండ్ పెరగడంతో ఉపకేంద్రాలపై ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వరి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయలు, పామాయిల్, పప్పుదినుసులు, పండ్లతోటలు సాగవుతున్నాయి. చెరువులు, కాల్వల కింద మినహా మిగిలిన ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్ల వినియోగంతో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరుగుతోంది.

ఇలాగైతే పంట చేతికందదు

జర్పులా రవి, విజయ దంపతులు, ధర్మాతండా, కూసుమంచి మండలం

ఉమ్మడిగా నీటిని వినియోగించుకునే బావి పరిధిలో ఎకరం విస్తీర్ణంలో వరి సాగుచేశాం. మరో అర ఎకరంలో కూరగాయలు పండిస్తున్నాం. విద్యుత్తు కోతల నేపథ్యంలో సరిపడా నీరందక వరిపైరు నిలువునా ఎండిపోతోంది. మరో నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే.. ఆతర్వాత నీరందించినా పంట చేతికందదు. ఎకరం పొలం దున్నడానికి రూ. 6,500, నాటు వేసేందుకు రూ. 4వేలు, ఎరువుల ఖర్చు రూ. 2వేలు వెరసి ఇప్పటివరకు రూ. 12,500 వెచ్చించాం.

సమయపాలన పాటించట్లేదు

పేరపాక వెంకటేశ్వర్లు, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

పది రోజులుగా అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టమొచ్చినట్లు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం రెండెకరాల్లో మిర్చి, మరో రెండెకరాల్లో పెసర పంట పండిస్తున్నాను. గంటకు మించి విద్యుత్తు సరఫరా కాకపోవటంతో తడిచిన సాళ్లే తడుస్తున్నాయి. కనీసం నాలుగు గంటల పాటు వరుసగా విద్యుత్తు సరఫరా చేయాలి.

చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయ్ లంకరాజు, రైతు, చర్ల మండలం

ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలి. ప్రభుత్వం చెప్పినట్టు 24 గంటలూ సరఫరా చేస్తే బాగుంటుంది. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. మోటార్లు కాలిపోతున్నాయి. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్తు సరఫరాలో అంతరాయాన్ని తొలగించాలి.

బోరు మోటారు కాలిపోయింది

గుగులోత్ మోతీలాల్, చుక్కలబోడు, టేకులపల్లి మండలం

రెండెకరాల్లో మిర్చి పంట పండిస్తున్నాను. విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ కారణంగా బోరు మోటారు కాలిపోయింది. మరమ్మతులకు రూ. 8వేలు ఖర్చయ్యింది. అసలే మిర్చి దిగుబడి ఆశాజనకంగా లేదు. లోవోల్టేజీతో నీరందక మిరప పిందె సాగడం లేదు.

పగటిపూటే అందించాలి..యలమంచి వంశీకృష్ణ, దుమ్ముగూడెం

తొలకరి వ్యవసాయం సమయంలో ఎడతెరిపిలేని వర్షాలు, గోదావరి వరదలతో తీవ్రంగా నష్టపోయాం. అనంతరం పంటలకు తామర, ఎర్రనల్లి, కత్తెర పురుగులు, వేరు కుళ్లు తెగుళ్లు సోకి సతమతమయ్యాం. ప్రస్తుతం విద్యుత్తు కోతలు, అంతరాయంతో మరింత నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయాల్లో విద్యుత్తు సరఫరా చేసినా వ్యవసాయ కూలీలు అందుబాటులో లేక రైతులు విద్యుత్తును వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పగలు ఎనిమిది గంటల పాటు విద్యుత్తు సరఫరా చేయాలి.

డిమాండ్‌కు తగినట్టు సరఫరాఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

జిల్లాలో డిమాండ్‌కు తగినట్లు విద్యుత్తు సరఫరా అవుతోంది. ఈ విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యవసాయ రంగానికి ఆటంకం కలగకుండా సరఫరా చేస్తాం.

# మన బడి ముస్తాబు

వరంగల్ : పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో రూ. 7,289 కోట్లతో పనులు చేపట్టారు. మౌలిక వసతుల కల్పనతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తయిన సర్కార్ బడులను ఫిబ్రవరి 1న అధికారికంగా ప్రారంభించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లను రెండు రోజుల క్రితం ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు నిర్మాణ పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభించడానికి సన్నాహాలు చేపడుతున్నారు. బడులను ప్రారంభించే రోజున ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రారంభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏదైనా మండలంలో ప్రారంభానికి సిద్ధమైన పాఠశాలలు ఎక్కువ సంఖ్యలో ఉంటే తదుపరి రోజుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులచే ప్రారంభించుకోవాలని మంత్రి సూచించారు.

సౌకర్యాలు ఇలా..ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు సమకూరుతున్నాయి. శౌచాలయాలకు నిరంతర నీటి సరఫరా, విద్యుత్ సదుపాయం, తాగునీరు, సామగ్రి, పెయింటింగ్, పెద్ద, చిన్న మరమ్మతులు, ఆకుపచ్చ రాత బోర్డులు, ప్రహరీ నిర్మాణం, ఆధునిక వంట గదులు, శిథిల భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు, ఉన్నత పాఠశాలల్లో భోజన శాల ఏర్పాటు, డిజిటల్ సౌకర్యాలు కల్పించారు.

# చేపల పెంపకంలో దళారులదే రాజ్యం..!

ములుగు : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. నేరుగా మత్స్యకారుల సొసైటీలకు చేప పిల్లల పంపిణీ ప్రక్రియను అప్పగించినప్పటికీ.. దళారులు తెర వెనక రంగ ప్రవేశం చేస్తున్నారు. పేరుకే సొసైటీలు తెరపై కనిపిస్తున్నాయి. రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేపపిల్లలను పంపిణీ చేస్తుండగా వాటిని దళారులు దోచేస్తున్నారు. సొసైటీలోని కొంతమంది సభ్యులతో దళారులు చీకటి ఒప్పందాలు చేసుకొని తక్కువ ధరకు చేపలను కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తూ పేదరికంలోనే మత్స్యకారులు మగ్గుతున్నారు.

చుట్టూ పహరా..చెరువుల చుట్టూ దళారులు పహరా కాస్తున్నారు. తన అనుచరులను కాపలా పెట్టి ఎవరైనా చెరువులోకి ప్రవేశిస్తే తన అనుచరులతో దాడులు కూడా చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధాన చెరువుల్లో పెంచిన చేపలను తక్కువ ధరకు కొనుగోలు చేసి



కోల్‌కత్తా, ముంబయి తదితర ప్రదేశాలకు తరలించి అక్కడ కిలోకి రూ. 500పై ధరకు విక్రయిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.

ప్రజలకు కిలో రూ. 150

వందశాతం రాయితీతో చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుండగా, ఆ చేపలను కొందరు దళారులు సొసైటీలోని కొందరితో చీకటి ఒప్పందంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిని స్థానికులకు కిలో రూ. 150కి విక్రయించగా, దళారీలు కేవలం రూ. 70కే కొనుగోలు చేస్తున్నారు. సొసైటీలోని ఇతర సభ్యులు ప్రశ్నించలేని పరిస్థితులు తీసుకొచ్చి చేపలను మధ్య దళారులు స్వాహా చేస్తున్నారు. దీంతో మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తోంది. ములుగు జిల్లాలోని ప్రధాన చెరువులన్నింటిలో మధ్య దళారుల ప్రమేయంతోనే చేపల పెంపకం జరుగుతోంది.

మొత్తం 450 తటాకాలు

ములుగు జిల్లాలో 9 మండలాల పరిధిలో చిన్న పెద్దా మొత్తం 450 చెరువులున్నాయి. వీటిల్లో రూ. 1.39 కోట్ల విలువ చేసే 1,48,75,396 బొచ్చె, రాహు, బంగారు తీగె, మెరిగె, రొయ్య రకాల చేప పిల్లలను వదిలారు. ఇందులో 440 చెరువుల్లో 35 నుంచి 40 ఎంఎం పరిమాణం కలిగిన 77,83,317 పిల్లలను, 10 పెద్ద చెరువుల్లో 80 నుంచి 100 ఎంఎం పరిమాణం కలిగిన 71.37,076 వాటిని పంపిణీ చేశారు.

మా దృష్టికి రాలేదుశ్రీపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ములుగు

దళారులున్నట్లు మా దృష్టికి రాలేదు. అలాంటివి ఉంటే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ముందస్తుగా హెచ్చరికలు చేస్తూ సొసైటీ సభ్యులకు నోటీసులు జారీ చేస్తాం. మత్స్య సొసైటీలు పారదర్శకంగా నడిచేలా చర్యలు తీసుకుంటాం.

# పెరిగిన విద్యుత్తు వినియోగం

మహబూబాబాద్ : శీతాకాలం పూర్తిగా ముగియక ముందే జిల్లాలో విద్యుత్తు వాడకం పెరిగిపోతోంది. సరఫరాకు మించి డిమాండ్ నెలకొనడంతో కోతలు విధిస్తున్నారు. యాసంగి పంటలకు సాగునీరందక పచ్చని పంట చేలు వడలిపోతుండడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయంతో కర్షకులకు కష్టాలు వచ్చిపడ్డాయి. పీసు తోడే దశలో ఉండే మొక్కజొన్న..పొట్ట దశలో ఉండే వరి పంటలు ఆశించిన స్థాయిలో చేతికొచ్చేలా లేదని రైతుల్లో ఆవేదన నెలకొంది. సుమారు 12 గంటల పాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తే సరిపోతుందని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాకు 2.92 మిలియన్ల యూనిట్ల విద్యుత్తు సరఫరాను కేటాయించారు. ఈ పది రోజుల నుంచి వినియోగం క్రమేణా పెరుగుతోంది. 3.21 మిలియన్ల యూనిట్లు కరెంట్‌ను వినియోగించారు. సరఫరాకు మించి 0.29 మిలియన్ల యూనిట్లు. ఆదివారం 3.61 మిలియన్ల యూనిట్లు వినియోగించారు. 0.69 మిలియన్ల యూనిట్లు అధికంగా వాడినట్లు అధికారులు తెలిపారు. గృహ వినియోగం పెరగడమే కాకుండా వ్యవసాయానికి సంబంధించి వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడం వల్ల సరఫరాకు మించి డిమాండ్ పెరిగినట్లు విద్యుత్తు అధికారి ఒకరు చెప్పారు. వాడకం పెరగడంతో లోడ్ ఎక్కువై లోవోల్టేజ్ సమస్య తలెత్తుతుండడంతో కోతలు విధిస్తున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం ఎలాంటి ఇబ్బందులు రాకుండానే సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు.

వృథా నివారించాలి

డిమాండ్ పెరుగుతున్నందున వినియోగదారులు విద్యుత్తు వృథా నివారించాలి. అత్యవసరమైనవి మినహా ఇతర విద్యుత్తు ఉపకరణాలను వినియోగించొద్దు. రైతులు చాలా పంటలకు సాగునీరందించిన వెంటనే తమ మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు ఉంటే వాటిని బంద్ చేయాలి.

పూర్తి స్థాయిలో సాగునీరందడం లేదు

బైరబోయిన చిరంజీవి, పొగుళ్లపల్లి, కొత్తగూడ

యాసంగిలో 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. బోరుబావులపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నాం. విద్యుత్తు సరఫరాలో కోత విధిస్తుండడంతో సాగు నీరు సరిగా అందడం లేదు. ఇలానే కోతలు ఉంటే ఆశించిన స్థాయిలో పంట చేతికొచ్చేలా లేదు. కోతలు లేకుండా పగటి పూటనే నాణ్యమైన సరఫరా ఇస్తే బాగుంటుంది.

కోతలు లేకుండా సరఫరా చేయాలి

బండి వెంకన్నకొద్ది రోజుల నుంచి కరెంట్ సరఫరాలో కోతలు ఏర్పడ్డాయి. ఐదెకరాల్లో సాగు చేస్తున్న వరికి సాగునీరందించడం ఇబ్బందిగా మారుతుంది. రాత్రి పూట ఇచ్చే బదులు పగటి పూటనే కోతలు లేకుండా సరఫరా చేస్తే పంటలకు నీరందించుకోవచ్చు. లేకుంటే రాత్రి సమయంలో పొలాల వద్దనే నిద్రించాల్సి వస్తుంది.

# జాబితాలో చేరిందో..మారిందో..!

నల్గొండ : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను అధికార భారాస ఈ నెల 21న ప్రకటిస్తారనే ప్రచారం నేపథ్యంలో.. జాబితాలో తమ పేర్లపై కొందరు ఎమ్మెల్యేలు అధిష్టానంలోని ముఖ్యుల ద్వారా ధ్రువీకరించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ప్రస్తుతం అందరూ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వివిధ సర్వేల ఫలితాలు, ప్రజా సమస్యల పరిష్కారం, తాజాగా ప్రభుత్వం చేసిన రుణమాఫీ, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం అనంతరం చేసిన ఫ్లాష్ సర్వే ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పార్టీ ముఖ్య నేత ఒకరు 'ఈనాడు'కు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాలకు గానూ తొలి విడతలో 8 నుంచి 9 పేర్లు ప్రకటిస్తారని విశ్వసనీయంగా తెలిసింది. 'ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, ఇటీవల నిర్వహించిన పలు సర్వేల్లో వెనకబడటం, పార్టీ పరిస్థితి బాగున్నా.. వ్యక్తిగతంగా ప్రజల్లో వ్యతిరేకత ఉన్న నాలుగు నుంచి ఐదుగురు ఎమ్మెల్యేల పేర్లను ఇప్పుడు ప్రకటించకపోవచ్చ'ని సదరు నేత వ్యాఖ్యానించడం గమనార్హం. తొలి దశలో పార్టీ పరిస్థితి, వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలపై సానుకూలత ఉన్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటన ఉండనుంది. సూర్యాపేట జిల్లాలో ఒకటి, నల్గొండ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు సంబంధించి తొలి దశలో అభ్యర్థుల ప్రకటన ఉండదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

ఆ నాలుగింటిపైనే అందరి దృష్టి



అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని మునుగోడు, నాగార్జునసాగర్, దేవరకొండ, కోదాడపై అందరి దృష్టి పడింది. ఈ నియోజకవర్గాల్లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తొలి జాబితాలో అభ్యర్థుల ప్రకటనపై ఆసక్తికర చర్చ సాగుతోంది. పార్టీ అభ్యర్థుల మార్పు లేకున్నా.. తొలి జాబితాలో ఈ నియోజకవర్గాల పేర్లు ఉంటాయా.. అనే ఉత్కంఠ నెలకొంది. ఒక్కో నియోజకవర్గంలో సుమారు అర డజన్ మంది నాయకులు పార్టీ టిక్కెట్ ఆశిస్తుండటం కారణంగా చెబుతున్నారు.

సాగర్‌లో గత కొన్నాళ్ల నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గాలుగా విడిపోయి పలు సందర్భాల్లో వర్గపోరు బహిర్గతమైంది. మన్నెం రంజిత్‌యాదవ్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఇక్కడ పార్టీ టిక్కెట్ కోసం పార్టీ పెద్దల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. మునుగోడులోనూ ఉప ఎన్నిక సమయం నుంచి వర్గపోరు జరుగుతూనే ఉంది. దీంతో పొత్తుల్లో భాగంగా ఈ స్థానాన్ని సీపీఐకి ఇస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో.. అధికార పార్టీ నుంచి బీసీ కోటాలో నారబోయిన రవి, కర్నాటి విద్యాసాగర్ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇటీవలే అసమ్మతి నేత సమావేశాలతో రచ్చకెక్కిన దేవరకొండలోనూ పురపాలిక మాజీ ఛైర్మన్ దేవేందర్ నాయక్ అందరిని సమన్వయపరుస్తూ పార్టీ పెద్దలను టిక్కెట్టివ్వాలని కలుస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలోని కోదాడలోనూ గత కొంత కాలం నుంచి అసమ్మతి నేతలు సమావేశాలు ఏర్పాటు చేయగా..ఇక్కడ ప్రస్తుతం విజిలెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న అమరగాని కృష్ణయ్య, సాహిత్య అకాడమీ ఛైర్మన్ గౌరీశంకర్ బీసీ కోటాలో టిక్కెట్ ఆశిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఉన్న అసమ్మతిపై పార్టీ హైకమాండ్ ఇప్పటికే దృష్టి పెట్టిందని..ఎన్నికల సమయం వరకు అంతా సర్దుకుంటుందని పార్టీ నేత ఒకరు స్పష్టం చేశారు.

# అసంపూర్తిగా యోగా కేంద్రాలు

నల్గొండ : సమయపాలన లేకుండా విధులు నిర్వహించడం, మారుతున్న ఆహారపు అలవాట్లు, తదితర కారణాలతో జనం అనారోగ్యం పాలవుతున్నారు. పట్టణాల సంస్కృతి గ్రామాల్లోకి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రభుత్వం నేషనల్ ఆయూష్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో హెల్త్-వెల్‌నెస్ సెంటర్ పేరిట యోగా కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రజలతో యోగాసనాలు వేయడంతో పాటు మంచి ఆహార అలవాట్లు నేర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పల్లెటూర్లో కేంద్రాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. యోగా కేంద్రాల్లో యోగా నేర్పడం కోసం గ్రామాల్లోని ఆసక్తి కల ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి నియామకం చేపట్టనున్నారు. అధికారులు ఇప్పటికే ఆసక్తి ఉన్న ఆశా కార్యకర్తల పేర్లనుఉన్నతాధికారులకు పంపించారు.



నియోజకవర్గంలో అసంపూర్తిగా పనులు

జిల్లాకు 42 ఆయుష్ కేంద్రాలు మంజూరు కాగా, గత సంవత్సరం 21 యోగా కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కేంద్రాన్ని రూ.6 లక్షలతో నిర్మించాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే 16 కేంద్రాలు పూర్తి కాగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హాలియా, నిడుమనూరు మండలం అంజనపల్లి, నందికొండ మున్సిపాలిటీలోని కేంద్రాలు ఆరు నెలలుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ మూడు కేంద్రాలు ఒకే గుత్తేదారు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సమాచారం. ప్రజలకు యోగదాయకమైన యోగా కేంద్రాల పనులను పూర్తి చేయకపోవడం వలన నిధులు తిరిగి వెళ్లిపోయే అవకాశం ఉందని, త్వరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

త్వరలో పూర్తి చేస్తాం

జిల్లాలో మంజూరు చేసిన యోగా కేంద్రాల్లో 16 నిర్మాణం పూర్తి అయినవి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులకు త్వరితగతిన పూర్తి చేస్తాం. గ్రామీణ ప్రజలకు యోగా కేంద్రాల వలన ఎంతో ఉపయోగం ఉంది.. ఆ దిశగా పనులు చేపడుతున్నాం.పద్మావతి, ఆయూష్ జిల్లా కోర్డినేటర్

# 'మధ్యాహ్నం' పస్తులేనా?



భూపాలపల్లి : గ్రామీణ ప్రాంత విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసి ఉన్నత చదువులకు మండల, పట్టణ కేంద్రాల్లోని కళాశాలల్లో అడుగుపెట్టగానే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం ఇంట్లో భోజనం సిద్ధం కాకపోవడంతో హడావుడిగా తినకుండా బయల్దేరి సాయంత్రం ఇంటికెళ్లే వరకు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. బయట హొటల్స్‌లో భోజనం చేసే స్తోమత లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కొందరు టిఫిన్‌బాక్స్‌లో భోజనం తెచ్చుకుంటున్నా మిగతా వారు మధ్యాహ్నం ఇంటికి వెళ్లకుండా.. ఏమీ తినకుండానే పాఠాలు వింటున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామంటూ ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ప్రకటించినా.. ఇప్పటికీ అమలుపై స్పష్టత లేదు. అప్పట్లో మంత్రివర్గ సమావేశంలో సైతం అమలుకు నిర్ణయం తీసుకున్నా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంపై విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

49 ప్రభుత్వ కళాశాలలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 49 ప్రభుత్వ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో చదివేది ఎక్కువగా నిరుపేద విద్యార్థులే.. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు భరించే స్థోమత లేని వారు సర్కారు బాటపడుతున్నారు. తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపించడం ఇష్టం లేని తల్లిదండ్రులు దగ్గరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. ముఖ్యంగా బాలికలు స్థానికంగా ఉండే కళాశాలల్లోనే చేరుతున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో జిల్లాలోని 49 ప్రభుత్వ కళాశాలల్లో 13,793 మంది విద్యార్థుల వరకు ఉండగా, మరో 16 వేలకు పైగానే ఆయా సామాజిక గురుకులాలు, ఆశ్రమ కళాశాలల్లో విద్య అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలైతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాలపై ప్రభావం..

ఆకలితో తరగతి గదుల్లో కూర్చుంటే పాఠాలు ఎలా అర్థమవుతాయి. సరిగ్గా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఇదే.. దూరప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లోని కళాశాలలకు ఉదయాన్నే వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందకపోవడంతో చాలా మంది ఒంటి పూట తరగతులకే హాజరవుతున్నారు. దీంతో హాజరు సామర్థ్యం, ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

భరోసా కల్పించాలి

ప్రభుత్వం ప్రకటించినవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి. పలుమార్లు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఇప్పటికైనా పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు భరోసా కల్పించాలి.

ఎం.సురేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు..కళాశాలల్లో మధ్యాహ్న భోజనం విషయంలో ఇప్పటికీ ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేపట్టాలని ప్రాథమికంగా సూచించింది. ఈ విషయంపై ప్రభుత్వం ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పథకం ప్రారంభమైతే విద్యార్థులకు మేలు కలుగుతుంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.. పథకం అమలైతే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.దేవరాజం, డీఐఈవో, భూపాలపల్లి

# కరిగిపోతున్న గుట్టలు



రాయికల్ :ఇది మెట్‌పల్లి మండలం కోనరావుపేట, కొండ్రికర్ల గ్రామాల మధ్య చెరువును ఆనుకొని ఉన్న గుట్ట. ఇక్కడి నుంచి మొరం యథేచ్ఛగా తరలించడంతో గుట్ట ఆనవాళ్లు కోల్పోతోంది. మొరం అక్రమ తరలింపు రెండు గ్రామాల మధ్య వివాదానికి దారి తీసింది. గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని రెండు గ్రామాల ప్రజలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఆందోళనలకు దిగారు. బీటీ రహదారికి పక్కనే ఉన్న ఈ గుట్ట నుంచి మొరం తరలుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అక్రమంగా మొరం తరలిపోతుందనడానికి ఈ ఘటనలే నిదర్శనంగా చెప్పవచ్చు.

మెట్‌పల్లి ప్రాంతంలో సహజ వనరులు అక్రమార్కుల చేతిలో కరిగిపోతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తూ లాభార్జనే ధ్యేయంగా గుట్టలను మాయం చేస్తున్నారు. యంత్రాల సాయంతో మొరం కొల్లగొడుతూ కాసులు దండుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా పెంచి అక్రమ రవాణాను నియంత్రించాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో భూముల ధరలు పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకొని నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటితో పాటు రహదారుల నిర్మాణాలకూ మొరం వినియోగిస్తుంటారు. మెట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ గుట్టల నుంచి, కాల్వల నుంచి కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా మొరం తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. గుట్టలను తొలిచేయడమే కాకుండా, కాల్వల గట్టుపైన ఉన్న మొరాన్ని తరలిస్తున్నారు. దీనివల్ల అటు సహజ వనరులు అంతరించడమే కాకుండా ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

కాల్వల మట్టికి కన్నం

మెట్‌పల్లి మండలంలో గ్రామాల వెంబడి వరదకాలువకు ఇరువైపులా గుట్టల్లా ఉన్న మొరం నిల్వలు కరిగిపోతున్నాయి. కాలువ గట్టు రక్షణ కోసం పోసిన మొరం యథేచ్ఛగా తరలిస్తుండడంతో గట్టు చదునై ఆనవాళ్లు కోల్పోతుంది. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో మొరం తవ్వకాలు చేపడుతూ టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. మొరం తరలిపోతుండడంతో కాలువకు ముప్పు పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతుండగా సంబంధిత అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొరం తరలింపునకు కొన్ని క్యూబిక్ మీటర్లకు చలానా కట్టి అనుమతి తీసుకుంటూ అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన మొరం తరలిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం.

మధు, ఆర్డీవో, మెట్‌పల్లి

అక్రమ మొరం తరలింపుపై చర్యలు తీసుకుంటాం. మొరం తవ్వాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. కోనరావుపేట, కొండ్రికర్ల మధ్యలో గుట్ట నుంచి మొరం తరలింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. అక్రమంగా తవ్వకాలు జరిపితే ప్రజలు సమాచారమివ్వాలి.

గోరంత అనుమతి.. కొండంత తరలింపు

మొరం తవ్వకాలు జరపాలంటే రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. ఎలాంటి నిబంధనలు పట్టించుకోకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అనుమతి తీసుకుంటున్నా.. తీసుకున్న దాని కంటే ఎక్కువగా ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతున్నారు. రోజురోజుకు మొరం అవసరాలు పెరుగుతుండడంతో ఒక్కో ట్రాక్టర్ మొరం దూరాన్ని బట్టి రూ.700 నుంచి రూ.900 వరకు తీసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లోని గుట్టను తొలుచుకుంటూ దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల రహదారులకు సమీపంలో ఉన్న గుట్టల నుంచి మొరం తరలిస్తూ అక్రమ దందా సాగిస్తున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి మొరం తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పేరుకుపోతున్న విద్యుత్తు బిల్లులు

రాయికల్ : పట్టణంలో వివిధ కార్యాలయాల బిల్లులు సుమారు రూ.20 లక్షల వరకు పేరుకుపోయాయి. గ్రామాల విద్యుత్తు బిల్లులు మరో రూ.62 లక్షలు రావాల్సి ఉండటంలో విద్యుత్తు అధికారులు వసూలుకు చర్యలు చేపడుతున్నారు. సామాన్య ప్రజలు తమ ఇంటి బిల్లు చెల్లించకపోతే సరఫరా నిలిపివేసే సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు లక్షల్లో ఉన్నా నోటీసుల వరకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.ప్రభుత్వ ఆసుపత్రి బిల్లులే అధికంపట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు సుమారు రూ.20 లక్షల వరకు బకాయిలు ఉండగా అందులో ప్రభుత్వ ఆసుపత్రి చెల్లించాల్సిన బిల్లు రూ.13,05,238 ఉంది. తహసీల్దార్ కార్యాలయం రూ.1,12,561, అటవీ శాఖో అధికారి కార్యాలయం రూ.1,07,740 పురపాలక సంఘం కార్యాలయం రూ.71,023, ప్రాథమిక పాఠశాల రూ.43,650 ఉన్నాయి. వీటితో పాటు రాయికల్ మున్సిపాలిటీ, ఇతర గ్రామ పంచాయతీలకు సంబంధించి వీధి దీపాలతోపాటు నీటి పథకాలకు చెందిన విద్యుత్తు బిల్లు బకాయిలు మరో రూ.62 లక్షల వరకు ఉన్నాయి. స్థానిక సంస్థలకు నిధులు సరిపడా విడుదల కాకపోవడంతో బిల్లులు నెలనెలా చెల్లించక బకాయిలు పేరుకుపోయి లక్షల్లోకి చేరాయి.

# విధుల్లో లేకుండానే.. ఉన్నట్టు..!

మేళ్లచెరువు : జిల్లా మారుమూల ప్రాంతం. జనాభా దాదాపు 75 వేలు. వీరందరికీ ప్రాథమిక వైద్య సేవలందించే మేళ్లచెరువు మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రమది. 24 గంటలు ప్రభుత్వ వైద్యసేవలందించే ఆసుపత్రిగా దీన్ని ఎప్పుడో మార్చారు కానీ ఆ మేరకు ఇక్కడ రోగులకు సేవలందడం లేదు. వంతులవారీ విధులు, అసలు ఉద్యోగులు రాకున్నా వచ్చినట్టు హాజరు పట్టికలో ఇతరులు చేసే సంతకాలు.. అసలు జాడే తెలియని వారి పోస్టింగ్‌ల వివరాలు ఇక్కడే దర్శనమిస్తాయి. ఈ పరిణామాలపై ఈ మధ్యే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికీ ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది.

మొత్తం 19 మందిప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 19 మంది ఉద్యోగులున్నట్టు హాజరు పట్టికలో కనిపిస్తుంది. ఇద్దరు వైద్యాధికారులు, సీహెచ్‌వో, పీహెచ్‌ఎన్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, యూడీసీ, ఫార్మసిస్టు, ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటరు, ఆఫీస్ సబార్డినేట్‌తో పాటు మరో నలుగురు కాంటిజెంట్ వర్కర్లున్నట్టు హాజరు పట్టికలో మొత్తం 19 మంది పేర్లు కనిపిస్తున్నాయి. వీరు గాకుండా మరో ముగ్గురు హెల్త్ సూపర్ వైజర్లకు ఇక్కడే పోస్టింగ్ ఉంది. వీరు సూర్యాపేట, కోదాడ పట్టణాలకు డిప్యూటేషన్ వేయించుకున్నారు.

ఇలా ఉంది వీరి నిర్వాకం

దాదాపు 75 వేల జనాభా ఉన్న ఈ మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలకు ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ ముగ్గురు వైద్యులుండాలి. ఒక్కరినే నియమించారు. ఇదిలా ఉండగా ఇక్కడ ముగ్గురు స్టాఫ్ నర్సుల విధులపై మొదట వివాదం తలెత్తింది. ముగ్గురు స్టాఫ్ నర్సులు నిత్యం మూడు షిఫ్టుల్లో ఉండాలి. కానీ రోజుకొక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మిగతా ఇద్దరి గురించి వైద్య బృందమే తమకు తెలియదనడం ఆశ్చర్యం. ఐనా వీరూ విధుల్లో ఉన్నట్టు హాజరు పుస్తకంలో సంతకాలు దర్శనమిస్తుండటం గమనార్హం. మొత్తానికి ఈ వ్యవహారం బహిర్గతమైంది.ఇక్కడ ఉండాల్సిన హెల్త్ సూపర్‌వైజర్లలో ఇద్దరు కోదాడ, మరొకరు సూర్యాపేటకు డిప్యూటేషన్ వేయించుకున్నారు. ప్రతినెలా వేతనాలు మాత్రం ఇక్కడి నుంచే తీసుకుంటున్నారు. వీరుగాక ఆఫీస్ సబార్డినేట్ ఏనాడూ విధులకు హాజరైన దాఖలాల్లేవు. ఇక్కడ నుంచే ప్రతినెలా వేతనం తీసుకుంటున్నారు. యూడీసీ కూడా చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుంటారు. ఈ ఆసుపత్రిలో మొన్నటిదాకా ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజరు, స్వీపరు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహించినా.. ముగ్గురికీ ఇక్కడే రెగ్యులర్ పోస్టు ఇచ్చారు. ఇప్పుడు వీరూ విధుల్లో పైవారితో పోటీ పడుతున్నారు. వారిలాగా రాకుండా తామూ సంతకాలు చేస్తామంటున్నారు. పైవారిలో ఒకరు అప్పుడప్పుడు తన పేరు చెప్పి ఆసుపత్రిలో కనిపించి రమ్మని ఒకరికి కూలి ఇచ్చి పంపిస్తున్నట్టు తెలిసింది.

పసిగట్టి హెచ్చరించినా..

ఈ మొత్తం వ్యవహారం ఇటీవల పీహెచ్‌సీకి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌వో దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. తాజాగా విధుల దుమ్మా చర్చనీయాంశమవుతుండగా.. ఆసుపత్రికి వచ్చేవారికి ఇక్కడ ఎవరు వైద్యం చేస్తారో కూడా తెలియని స్థితి. ఆ మధ్య ఒకట్రెండు సమావేశాల్లోనూ సిబ్బంది పనితీరుపై ఎంపీపీ ఆగ్రహించారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి కూడా ఆ మధ్య ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోపాలను పసిగట్టి హెచ్చరించారు. అయినా మార్పు కనిపించడం లేదు.ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం చర్యలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందరూ సక్రమంగా విధులు నిర్వహించాలి. ఇక్కడ ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నమాట వాస్తవమే. వాస్తవంగా ముగ్గురూ విధుల్లో ఉండాలి. రోజుకొక్కరు వస్తున్నారు. వీరితో పాటు మిగతా సిబ్బంది విధుల విషయాలూ డిప్యూటీ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం.వేణుగోపాల్ నాయక్,మండల వైద్యాధికారి, మేళ్లచెరువు

# చచ్చినా దయలేదా!

భువనగిరి : భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రిలో మార్చురీ అధ్వానంగా మారింది. నిర్వహణ కొరవడటంతో పరీక్షలకు తీసుకొచ్చిన మృతదేహాలను భద్రపర్చలేని స్థితి నెలకొంది. గదిలో ఫ్రీజర్లు ఉన్నా.. పనిచేస్తున్నాయా లేవా అనే సందేహం కలుగుతోంది. శవాలు భద్రపర్చినా దుర్వాసన వస్తోంది. జిల్లా కేంద్రాసుపత్రి మార్చురీకి వివిధ ఘటనలు, ప్రమాదాల కారణంగా చనిపోయిన వారి మృతదేహాలను ప్రతి రోజు ఒక్కటి రెండు తీసుకొస్తుంటారు. భద్రపర్చేందుకు ప్రస్తుత గదిలో సరైన వ్యవస్థ లేకపోవడంతో అక్కడే గదిలో వదిలేస్తున్నారు. ఆ సమయంలో ఎలుకలు, పందికొక్కులు శవాలను కొరుకుతున్నాయి. భువనగిరిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు జిల్లా కేంద్రాసుపత్రి మార్చురీకి తరలించారు. తరలించిన మృతదేహాన్ని భద్రపర్చేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంతో మృతుడి ముఖం, నుదుటి భాగాలపైన ఎలుకలు, పందికొక్కులు కొరకడంతో గాట్లు పడ్డాయి.

నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా..

జిల్లా కేంద్రాసుపత్రి మార్చురీకి కేటాయించిన గదిని పూర్తిగా మార్చేందుకు టీఎస్ఎమ్ఐడీసీ ద్వారా రూ 1.90 కోట్లు నిధులు మంజూరయ్యాని ఏడాది నుంచి అధికారులు చెబుతున్నారు. నిర్మాణ ప్రక్రియ నడుస్తుందని చెబుతున్నా ఇప్పటి వరకు నిధులు విడుదల, టెండర్ ప్రక్రియ కనీసం మొదలు కాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మార్చురీ గది వద్ద కొత్త భవనం నిర్మించి శవాలు భద్రపర్చేందుకు కావాల్సిన వ్యవస్థను, మౌలిక వసతుల ఉండేలా టీఎస్ఎమ్ఐడీసీకి ఇంజినీర్ల బృందం ఏడాది క్రితం ప్రతిపాదన చేసి పంపించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు.

కొరవడిన నిర్వహణ

జిల్లా కేంద్రాసుపత్రిలో మార్చురీ నిర్వహణ లోపాలు ఇటీవల వెలుగు చూశాయి. ప్రస్తుతం రెండు ఫ్రీజర్లు ఉండగా ఒకటి పనిచేయకపోవడంతో మరమ్మతులు చేయించారు. ఉన్నవాటిలో నిర్వహణ సరిగా లేక పనిచేయడం అంతంతమాత్రమే. దీనికి తోడూ శవాల గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచకపోవడంతో మరింత దుర్వాసన వెదజల్లుతోంది. గుర్తుతెలియని శవాలను భద్రపరిచిన సమయంలో కుళ్లిపోతున్నాయి. ఆసుపత్రి ఆవరణ, చట్టుపక్కల ఇళ్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

టెండర్ ప్రక్రియ నడుస్తోంది

మార్చురీ నిర్మాణం, ఆధునికీకరణ కోసం రూ.1.90 కోట్లు నిధులు విడుదలయ్యాయి. టీఎస్ఎంఐడీసీ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ నడుస్తుంది. అక్కడ టెండర్ ప్రక్రియ వేగవంతం జరిగేలా అధికారులను కోరుతాం. ప్రస్తుతం ఉన్న మార్చురీ నిర్వహణపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం.

డాక్టర్ చిన్ననాయక్, సూపరింటెండెంట్

గుర్తుతెలియని మృతదేహాలను భద్రపర్చలేక...గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను (మూడురోజులు) 72 గంటలు భద్రపర్చాల్సి ఉంటుంది. ఆలోపు ఆచూకీ తెలిస్తే ఆ మృతదేహాలకు శవపరీక్షల తంతు పూర్తి చేసిన తర్వాత సంబంధీకులకు అప్పగిస్తారు. భువనగిరిలో యాచకులు, అనాథల మృతదేహాలు ఎక్కుగా మార్చురీకి వస్తున్నాయి. జిల్లా మీదుగా సికింద్రాబాద్-కాజీపేట ప్రధాన రైలుమార్గం ఉండటంతో భువనగిరి, బీబీనగర్, యాదాద్రి రైల్వేస్టేషన్ల పరిధిలో రైలు కిందపడి ప్రమాదవశాత్తు మృతిచెందిన, ఆత్మహత్యలు చేసుకున్న వారి శవాలను జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నారు. శవాలను మూడురోజుల పాటు భద్రపర్చేందుకు సరైన ఫ్రీజర్లు లేక కుళ్లిపోతున్నాయి.

# అభివృద్ధికి అడుగులు!

భద్రాచలం : రామాలయం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. యాదాద్రి తరహాలో రామ మందిరాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ గురువారం ప్రకటించారు. ముంపు నివారణకు కరకట్టలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఇదే విషయంపై ప్రకటన చేశారు. ఈ పరిస్థితుల్లో త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ప్రసాద్ (పిల్‌గ్రిమేజ్ రిజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) పనులు కొనసాగుతున్నందున వాటికి దీటుగా రామాలయ బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో ఆర్కిటెక్ట్ ఆనందసాయి తయారుచేసిన ప్రణాళికను చినజీయర్‌స్వామి పరిశీలించారు. మారిన పరిస్థితుల్లో మరోసారి బృహత్తర ప్రణాళికను రూపొందిస్తారా లేక ఆరేళ్ల కిందట తయారైనదాన్నే ఖరారు చేస్తారా అన్న అంశంపై ఆసక్తి నెలకొంది.



ఒడిశా వెళ్లిన జలవనరుల శాఖ నిపుణులు

భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండువైపులా రూ.3,500 కోట్లతో 85 కి.మీ. పొడవునా కరకట్టలు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు జలవనరుల శాఖ రాష్ట్ర స్థాయి విభాగంలోని ఆరుగురు నిపుణులు రెండ్రోజుల క్రితం ఒడిశా వెళ్లారు. అక్కడ నదుల వరద ముంపును ఎలా తగ్గిస్తున్నారో పరిశీలిస్తున్నారు. కరకట్టలు ఉన్నచోట్ల లాభనష్టాలను గమనించి లేనిచోట్ల ఎలాంటి ప్రత్యామ్నాయ పద్ధతులు పాటిస్తున్నారో వీడియోల రూపంలో చిత్రీకరించారు. అక్కడ గ్రహించిన విషయాలపై సమీక్షించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. భద్రాచలం శివారులో చాలాకాలంగా ఆగిపోయిన అర కిలోమీటరు కరకట్ట నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని నిర్ణయించారు. వెనుక జలాల (బ్యాక్ వాటర్) సమస్య తలెత్తకుండా మోటర్లను ఏర్పాటు చేసేందుకు అంగీకారం కుదిరింది. లోతట్టు ప్రాంతవాసులను తరలించేందుకు 3వేల ఇళ్లను నిర్మించాలని గతేడాది స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కాలనీలను వదిలేందుకు కొందరు ముంపు బాధితులు ఇష్టపడకపోయినా మరికొందరు సుముఖంగా ఉన్నందున దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# రైళ్ల రద్దు.. 'ప్యాసింజరు'కు కష్టాలు

కాజీపేట :రెండు నెలలుగా ప్యాసింజరు రైళ్లు (ఇప్పుడు వీటిని ఎక్స్‌ప్రెస్‌లుగా పిలుస్తున్నారు) నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ పనులు, ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లేవారికి చౌక ప్రయాణ సాధనాలుగా ఇవి ఉండేవి. మూడోలైను పనులను కారణంగా చూపుతూ ఏడాది కాలంగా అనేక రైళ్లను రద్దు చేస్తూ వస్తున్నారు. ఈ ప్రకటనలు చివరి నిమిషంలో విడుదల చేస్తుండడంతో సమాచారం సైతం ప్రయాణికులకు తెలియడం లేదు. కొత్త పట్టాలు వేయడానికి నెలలకొద్ది జాప్యం చేస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేసేదేం లేక రోజువారీ ప్రయాణికులు రోడ్డు మార్గంలో ఇతర రవాణా సాధనాలను ఆశ్రయిస్తు న్నారు. ఇది రైల్వేకు భవిష్యత్తులో ప్రమాదకరంగానూ మారవచ్చు. 'జూన్ 18 నుంచి క్రమంగా రామగిరి, బల్లార్షా, డోర్నకల్, సింగరేణి, హైదరాబాద్ పుష్‌పుల్ రైళ్లను రద్దు చేస్తూ ప్రతి రెండు వారాలకు ఒకసారి దీన్ని పొడిగిస్తూ వస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు రద్దు గడువు ఉంది. ఇప్పటికైనా వీటిని పునరుద్ధరిస్తారా లేదా అని ప్రయాణికులు వేచి చేస్తున్నారు. శుక్రవారం వరకు రైల్వే నుంచి ఏ ప్రకటనా రాలేదు'

జీవితాలతో ముడిపడి: చౌకగా, సుఖంగా, తక్కువ సమయంలో గమ్యం చేర్చే ప్యాసింజరు రైళ్లు ప్రయాణికుల జీవితాలతో ముడిపడి ఉంటాయి. పేదలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అమ్ముకునే చిరువ్యాపారులు ఎక్కువగా వీటిపై ఆధారపడతారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లను కాకుండా కేవలం ప్యాసింజరులనే రద్దు చేయడం వెనుక రహస్యం తెలియడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం సౌకర్యవంతంగా రామగిరి..రోజూ ఉదయం బల్లార్షా మార్గంలో కాజీపేట నుంచి ప్రయాణికులు వెళ్లడానికి రామగిరి అత్యంత అనువైనది. దీని తర్వాత ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నా ఉదయం 9 గంటలలోపు జమ్మికుంట, ఓదేల, మంచిర్యాల, రామగుండం ప్రాంతాలకు వెళ్లడానికి వీలుగా ఉంటుంది. పనులు పూర్తి చేసుకుని సాయంత్రం కాగజ్‌నగర్ లేదా, సింగరేణికి తిరిగి రావొచ్చు. రామగుండం, మంచిర్యాల, పెద్దపల్లి ప్రాంతాలకు వెళ్లడానికి రోడ్డు మార్గంలో రెండు మూడు బస్సులు మార్చాల్సి ఉంటుంది. ఇది ప్రయాణికులకు దూరాభారం.

రామా.. ఇవేమి ప్రయోగాలు..

బల్లార్షా మార్గంలోని ప్రయాణికులు భద్రాచలం, కొత్తగూడెం వెళ్లడానికి ఒకే ఒక రైలు సింగరేణి ఎక్స్‌ప్రెస్. దీని మీద రైల్వే మొదటి నుంచీ ప్రయోగాలు చేస్తోంది. ముందుగా బల్లార్షా నుంచి కాజీపేట రైల్వే స్టేషన్‌కు వచ్చి భద్రాచలం రోడ్డుకు వెళ్లేది. దీంతో ఆలస్యం అవుతుందని కాజీపేట వంతెన కింద కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌ను నిర్మించి అక్కడి నుంచే రైలును నేరుగా వరంగల్ మీదుగా భద్రాచలం రోడ్డుకు పంపుతున్నారు. దీనికి మామూలుగా ప్యాసింజరు రైలు కోచ్‌లు ఉండేవి. వాటిని తొలగించి పుష్‌పుల్‌గా మార్చారు. దూర ప్రాంత రైలు కాబట్టి ప్రయాణికుల వినతి మేరకు రెండు మూత్రశాలలు ఏర్పాటు చేశారు. తర్వాత బల్లార్షా మార్గంలో ఏ చిన్న పనులు జరిగినా ఈ రైలును రద్దు చేస్తూ వస్తున్నారు. భద్రాచలం వెళ్లడానికి బల్లార్షా మార్గంలో ప్రయాణికులు కాజీపేటకు వచ్చి ఇక్కడి నుంచి డోర్నకల్ లేదా ఖమ్మం, విజయవాడకు వెళ్లి అక్కడ నుంచి భద్రాచలం వెళుతున్నారు. వీరి కష్టాలు రాముల వారికే తెలియాలి.

సికింద్రాబాద్ పుష్‌పుల్ లేక ఇబ్బందులు

వరంగల్ నగరం నుంచి రోజూ మధ్యాహ్నం సికింద్రాబాదు వెళ్లడానికి పుష్‌పుల్ చాలా అనువైన చౌకైన రైలుగా ఉండేది. ఇప్పుడు ఉదయం మాత్రమే నడుపుతూ మధ్నాహ్నం రద్దు చేయడం వల్ల రాజధానిలో ఉద్యోగాలు చేసుకునే వారు వ్యయ ప్రయాసాలకు లోనవుతున్నారు. పుష్‌పుల్ రైలులో సికింద్రాబాదు వెళ్లడానికి రూ.60 మాత్రమే. బస్సుల్లో రూ.350 వరకు పెట్టి వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఈ విషయంపై రైల్వే అధికారులతో మాట్లాడగా.. బల్లార్షా, విజయవాడ మార్గంలో కొత్తగా రైలు పట్టాలను నిర్మిస్తున్నందున ఈ సమస్య ఉత్పన్నమౌతోందని చెప్పారు. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవించామని.. త్వరలో రైళ్లను పునరుద్ధరించే అవకాశం ఉందని తెలిపారు.

ప్రయాణికుల కష్టాలు గుర్తించరా..

ప్యాసింజరు రైళ్లు రద్దు చేసినప్పుడు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. చిన్న రైల్వే స్టేషన్లలో ఇవి ఆగవు కాబట్టి అక్కడి ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది. ఆ రైల్వే స్టేషన్లకు కూడా ప్రాధాన్యం లేకుండా పోతోంది. రైళ్లు ఆగనప్పుడు అవి ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది.

ఫణి, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యులు

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి..నేను రోజూ ఓదెల నుంచి కాజీపేట, వరంగల్‌కు వస్తుంటాను. ఓదెలలో ఆగే ప్యాసింజరు రైల్లు రెండు నెలలుగా రద్దు చేస్తున్నారు.

# గతానికి భిన్నంగా.. అంచనాకు దూరంగా..



ఖమ్మం : ఉభయ జిల్లాల్లో ఈసారి 10,75,393 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సీజన్ ఆరంభంలో వర్షాలు ఊరించి ఉసూరుమనిపించాయి. ఆలస్యంగా నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు దిగాలుపడ్డారు. వ్యవసాయ పనులు మందకొడిగా సాగాయి. జులైలో భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పత్తి విత్తనాలు నాటడం, వరినాట్లు వేయటం సాధ్యపడలేదు. మిగిలిన పంటలూ అంచనాల మేరకు సాగవ్వలేదు. రెండు జిల్లాల్లో ఇప్పటివరకు 7,73,971 ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో అంచనా వేసిన దాంట్లో 71.97 శాతం పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

ఆశాజనకంగా ధరలు

గతేడాదితో పోల్చితే ఈసారి మిరప ధరలు గణనీయంగా పెరిగాయని అధికారులు చెబుతున్నారు. నిరుడు ఎకరాకు 15-25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఫిబ్రవరిలో క్వింటా రూ.17-18వేలు, మార్చిలో రూ.18-20వేలు, ఏప్రిల్‌లో రూ.22-24వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.22-24వేల వరకు పలుకుతోంది. ధర రూ.20వేల పైన ఉంటే గిట్టుబాటు అవుతుందని రైతులు తెలిపారు. ప్రస్తుత వాతావరణం మిరప సాగుకు అనుకూలంగా ఉంది. నా సొంత పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని పంట పండిస్తున్నాను. మిరప ధర ఆశాజనకంగా ఉండటంతోనే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నాను

చింతలపాటి కృష్ణ, కౌలు రైతు, తల్లాడ

ఖమ్మం జిల్లాలో వ్యవసాయ పంటలు 3,80,621, ఉద్యాన పంటలు 12,780 ఎకరాల్లో సాగయ్యాయి. పత్తి, వరి పంటల వైపే రైతులు మొగ్గుచూపారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2,23,919 ఎకరాలు అయితే 1,79,287 ఎకరాలకు పంట పరిమితమైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,89,983 ఎకరాలు కాగా ఇప్పటివరకు 1,36,578 ఎకరాల్లో నాట్లు వేశారు. ఈ నెలాఖరు వరకు నాట్లు వేసేందుకు అవకాశం ఉండటంతో సాగు విస్తీర్ణం మరికొంత పెరగొచ్చు. మిరప 80 వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉన్నప్పటికీ సుమారు 3 వేల ఎకరాలకే పరిమితమైంది. మొక్కజొన్న-1,982, పెసర- 13,316, మామిడి 6,528 ఎకరాల్లో సాగయ్యాయి.

# రాయితీ సొమ్ముకు.. ఎదురు చూపులే..!



అశ్వారావుపేట : 'ఆయిల్‌పాం వేసుకున్న ప్రతి రైతుకూ ఉద్యానశాఖ రాయితీ ఇస్తోంది. మొక్కలు వేసుకోవడమే తరువాయి.. మీ బ్యాంకు ఖాతాలో సొమ్ములు పడతాయి' అన్న అధికారుల మాటలు నీటిమూటలుగానే మిగిలాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది మంది ఆయిల్‌పాం రైతులకు రావాల్సిన రాయితీ సొమ్ము సక్రమంగా రాని దుస్థితి నెలకొంది. 2018 నుంచి 2022 వరకూ తోటలు వేసుకున్న రైతులకు వరుసగా నాలుగేళ్ల పాటు ఇచ్చే రాయతీలు సరిగా అందలేదు. ఖమ్మం జిల్లాలో 5056 మంది రైతులు 21వేల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 4820మంది రైతులు 18వేల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు వేసి రాయితీ సొమ్ముకు ఎదురుచూస్తున్నారు. వీరిలో కొందరికి కేవలం ఒకటి రెండేళ్ల రాయితీనే అందింది. ఇదేమని అధికారులను అడిగితే పైనుంచే రాలేదన్న సమాధానం వస్తోంది. 2018కి ముందు, ఆ తరువాత అంటే 2022 తరువాత తోటలు వేసుకున్న వారికి మాత్రం సొమ్ములు అందుతున్నాయి.

రాయితీ అందాల్సిందిలా..

ఆయిల్‌పాం రైతులు తోట వేసుకునేందుకు తొలుతగా ఎకరాకు (57 మొక్కలకు) రూ. 11,600 అందిస్తారు. అనంతరం ఏటా ఎరువులు, అంతర పంటల సాగుకు రూ. 4,200 చొప్పున నాలుగేళ్లలో 16,800 చెల్లించాలి. అలాగే బిందు సేద్యం పరికరాలకు రూ.22,518 రాయితీ లభిస్తుంది. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర గ్రాంటులు కలిపి రైతులకు రాయితీగా ఇవ్వాల్సి ఉంది. బిందు సేద్యం పరికరాలకు మాత్రం నేరుగా కంపెనీలకు చెల్లించారు. రైతులకు ఇవ్వాల్సిన మిగతా రాయితీ సొమ్ములు అందలేదని బాధిత రైతులు వాపోతున్నారు.

నేను 2020లో అయిదెకరాల్లో ఆయిల్‌పాం తోట వేశాను. రెండేళ్ల రాయితీ సొమ్ములు సొమ్ములు నేటికీ రాలేదు. అడిగితే వస్తాయి వస్తాయి అంటున్నారరేగాని రావడంలేదు.

ఆత్మకూరి పోలారావు, గుర్రాలచెరువు, భద్రాద్రి జిల్లా

నేను, నా కుటుంబంలో వారు 16 ఎకరాల్లో ఆయిల్‌పాం తోట 2020లో వేశాము. మొక్కలకు, తొలి ఏడాది రాయితీ ఇచ్చారు. ఆతర్వాత మూడేళ్ల సొమ్ములు రాలేదు. అడిగితే ప్రతిపాదనలు పంపాము, వస్తాయంటున్నారేగాని ఇవ్వడంలేదు. పాలపాటి శ్రీనివాసరావు, గౌరిగూడెం, ఖమ్మం జిల్లా

ఆయిల్‌పాం తోటలు వేసిన కొందరు రైతులకు రాయతీలు రాలేదు. జిల్లాల వారీగా ఉన్నతాధికారులకు ఆయా రైతుల వివరాలతో ప్రతిపాదనలు పంపాము. రాగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాము. మా వద్ద 2022 నుంచి పెండింగ్ లేవు. అంతకు ముందు నాలుగేళ్లలో తోటలు వేసిన రైతులకు సంబంధించినవి రావాల్సి ఉంది. డీహెచ్‌ఓ జి.మరియన్న

# అద్దె పరికరాలతో.. ఆదాయాన్ని అందిపుచ్చుకుని



ఖమ్మం : వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకు ఇస్తూ.. అదిరిపోయే ఆదాయాన్ని అందుకుంటున్నారు మహిళా సంఘ సభ్యులు. ఈ వ్యాపారంలో తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు. పొదుపు సంఘం సభ్యులంతా సంఘటితంగా ఏర్పడి ఏటా రూ.లక్షల్లో ఆదాయాన్ని అందుకుంటున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ మహిళా సంఘంగానూ పురస్కారాన్ని అందుకున్నారు ములకలపల్లి మండల సీతారామ మహిళా రైతుల, ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు.

కేంద్ర ప్రభుత్వసహకారంతో సంఘంగా..

కేంద్రం ప్రారంభించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో భాగంగా మండలంలో 614 మంది మహిళా సభ్యులతో 'సీతారామ మహిళా రైతుల ఉత్పత్తిదారుల సంఘం' 2021లో సెర్ప్ సహకారంతో ఏర్పడింది. తమ వాటాగా రూ 3.75లక్షలు చెల్లించి, కంపెనీస్ యాక్టు క్రింద నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా అంతే మొత్తంలో నిధులు ఈ సంఘానికి మంజూరు చేసింది. వెనుకబడిన ప్రాంతం కావడంతో ఈ ఉత్పత్తిదారుల సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం (నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్) పథకంలో భాగంగా రూ.22 లక్షలతో వ్యవసాయానికి ఉపయోగపడే ఆధునిక రోటావేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, ప్యాడీ వీడర్, కల్టివేటర్, స్ప్రేయర్లు తదితర యంత్రాలు, పరికరాలను అందజేసింది. దీంతో సంఘంలోని రైతులు 'అంకిత కస్టమర్ హైరింగ్ సెంటర్' (ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అద్దె కేంద్రం) ను ఏర్పాటు చేసి రైతులకు యంత్రాలు, యంత్ర పరికరాలు అద్దెకు ఇవ్వడం ఆరంభించారు.

చిర కాలంలోనే మంచి గుర్తింపు

ఈ వ్యాపారం ద్వారా రెండేళ్ల వ్యవధిలో 6.64 లక్షల ఆదాయాన్ని అందుకున్నారు. రాష్ట్రంలో కస్టమర్ హైరింగ్ కేంద్రాలలో 'అంకిత కస్టమర్ హైరింగ్ సెంటర్' ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 20న వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి (సీహెచ్‌సీ) సమావేశంలో ఉత్తమ పురస్కారాన్ని సంఘ సభ్యుల తరపున డీపీఎం సునందన్, ఏపీఎం రవీందర్‌లు స్వీకరించారు.

దేశస్థాయిలో పోటీకి..

ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో 238 మంది రైతుల నుంచి సీతారామ సంఘం ద్వారా సుమారు రూ.6.35 కోట్ల విలువైన ఎండు మిర్చి కొనుగోలు చేశారు. దీంతో దేశంలోని మిగిలిన సంఘాల్లో అగ్రగామిగా నిలిచేందుకు పోటీపడుతోంది. ఈ సంఘ సభ్యుల ప్రగతిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ సంఘం ద్వారా జీడి గింజలు, వేరుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది.

రాష్ట్ర స్థాయిలో అవార్డును అందుకోవడం, అధికారుల నుంచి ప్రశంసలు పొందడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది నుంచి రూ. 39 లక్షలతో జీడిగింజలు, 23 లక్షలతో వేరుశనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. త్వరలోనే జీడిగింజల ప్రాసెసింగ్ యూనిట్‌ను సంఘం ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు వారికి అవసరమైన శిక్షణ, సహాయ సహకారాలు అందిస్తున్నాం. జిల్లా, మండల అధికారుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైంది.

పుల్లమ్మ, మహిళా ఉత్పత్తిదారుల సంఘం ఛైర్‌పర్సన్

# వంతెనలు పూర్తయ్యేదెన్నడు..?

ములుగు : వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారిలోని రూ.5.65 కోట్లతో చేపట్టిన వంతెనలు పూర్తయ్యేదెన్నడోనని పంటపొలాలకు వెళ్లే రైతులు, వాహనదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాగారం సమీపంలోని లోతట్టు ప్రాంతం ఏటా గోదావరి వరదపోటుతో ముంపునకు గురవుతోంది. వరదపోటు, భారీవర్షాలతో కొంగాలవాగు వంతెనపై వరదనీరు చేరుతుంది. వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారిలో ప్రజల, వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద వాజేడు సమీపంలో ముంపునకు గురయ్యే ప్రదేశంలో రూ.4.85 కోట్లు, కొంగాలవాగుపై రూ.80 లక్షల వ్యయంతో రెండు వంతెనల నిర్మాణాలను ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. వర్షాకాలం నాటికి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేస్తామని ప్రకటించినా నేటికీ పూర్తి కాలేదు. ఈ ఏడాది మే నాటికి వంతెనల నిర్మాణాలు పూర్తిచేయాల్సిన గుత్తేదారులు గోదావరి వరదలు, భారీవర్షాల సాకుతో పనులను నిలిపివేశారు. అధికారుల అలసత్వం, గుత్తేదారు నిర్లక్ష్యంతో సమీప గ్రామాల ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు.

వరదలు తగ్గినా ప్రారంభం కాని పనులు

వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారిలో రాకపోకలకు ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా



అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గోదావరి వరదలు తగ్గిపోయి నెలరోజులు గడుస్తున్నా వంతెనల పనులను చేపట్టడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. కొంగాలవాగు వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. వరదనీటితో డైవర్షన్ రోడ్డులోని పైపులు బయటపడ్డాయి. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని దుస్థితి.

అవసరం లేని చోట ఎత్తులో..

కొంగాలవాగుపై నిర్మిస్తున్న వంతెనతో ప్రయోజనం శూన్యమని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలోని పాత వంతెన ఎత్తులోనే కొత్తది నిర్మిస్తుండడంతో గోదావరివరదపోటుతో మునిగిపోయేందుకు అవకాశం ఉందని పేర్కొంటున్నారు. నాగారం సమీపంలో వరదపోటుతో తాత్కాలికంగా ముంపునకు గురయ్యే ప్రదేశంలో రూ.4.85 కోట్లతో హైలెవెల్ వంతెనను నిర్మిస్తున్నారు. ఉధృతంగా ప్రవహించే కొంగాలవాగుపై కేవలం రూ.80 లక్షలతో తక్కువ ఎత్తులో బ్రిడ్జి నిర్మించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

పనులు చేపడతాం..

వంతెన నిర్మాణానికి వచ్చిన కూలీలు వరదలు, వర్షాల కారణంగా స్వగ్రామాలకు వెళ్లారు. త్వరలో పనులు చేపడతాం. కొంగాలవాగు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేస్తాం. రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలకు ఏర్పాట్లు చేపడతాం.ప్రమోద్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

# ఆక్రమించి.. ప్లాట్లుగా మలిచి!

ములుగు : సాధారణంగా నీటి ప్రవాహం సక్రమంగా వెళ్లాలంటే నాలా వంకలు తిరగకూడదు. వరంగల్ ప్రాంతం నీట మునగడానికి కారణమైన హంటర్‌రోడ్ బొందివాగు, ఉర్సు చెరువు నాలాలు చూస్తే పాము మెలికలు తిరిగినట్లుగా ఉన్నాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు, స్థిరాస్తి వ్యాపారులు నాలా దారిని ఇష్టానుసారంగా అన్యాక్రాంతం చేయడం వల్లే ఇలా కనిపిస్తున్నాయి. బీఆర్‌నగర్, ఉర్సుగుట్ట రోడ్డులో పరిశీలిస్తే నాలాల స్థలాలు ప్రైవేటు ప్లాట్లుగా మారాయి. వీటిని తొలగించకపోవడంతో నాలాల్లో నీరు పొంగి నగరాన్ని ముంచెత్తింది. ఎక్కువ వరద నీరు పారే కీలకమైన వీటి విస్తరణపై గ్రేటర్ వరంగల్, ఇరిగేషన్ శాఖలు అశ్రద్ధ వహిస్తున్నాయి. 2020 సెప్టెంబరు, అక్టోబరులో హనుమకొండ జవహర్‌నగర్, నయీంనగర్, వరంగల్ భద్రకాళి నాలాల ఆక్రమణలు కూల్చేశారు. బొందివాగు, ఉర్సు చెరువు మత్తడి నాలాలు వదిలేశారు. దీంతో మూడేళ్లుగా బీఆర్‌నగర్, హంటర్ రోడ్, సాయినగర్, బృందావన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీ, రామన్నపేట, పోతననగర్, సరస్వతి కాలనీ, రంగంపేట ముంపునకు గురవుతున్నాయి. నగర శివారులోని వరద నీరంతా ఇవే నాలాల గుండా నగరంలోకి వస్తున్నాయి. ప్రభుత్వ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయని ప్రజలంటున్నారు.

బొందివాగు నాలా: హంటర్‌రోడ్ బొందివాగు 100 ఏళ్ల క్రితం నాటిదని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. తిమ్మాపూర్, కొండపర్తి, అమ్మవారిపేట దామెర చెరువు, భట్టుపల్లి, రంగశాయిపేట బెస్తం చెరువు, మద్దెలకుంట, న్యూశాయంపేట కోటి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువుల వరదనీరంతా బొందివాగు నాలా నుంచి భద్రకాళి చెరువులోకి వెళ్లేవి. హంటర్‌రోడ్ ప్రధాన రోడ్డు కావడంతో కాలనీలు వెలిశాయి. బొందివాగు నాలా పరిసరాల్లో భవన నిర్మాణలు జరిగాయి. వర్షాకాలంలో బొందివాగు నాలా ద్వారా సుమారు 15-16వేల క్యూసెక్కుల నీళ్లు పారుతాయని అంచనా. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించినా ఇంత వరకు దీన్ని అభివృద్ధి పరచడం లేదు. ఉర్సు చెరువు మత్తడి నాలా: ఉర్సు రంగసముద్రం చెరువు మత్తడి నుంచి బొందివాగు రైల్వేట్రాక్ వరకు మియ్యాగాని మాటు(నాలా) చాలా వరకు కుదించుకుపోయింది. కొందరు రాజకీయ నాయకులు, ప్రైవేటు వ్యక్తులు నాలా స్థలాలు ప్లాట్లు చేసి అమ్మేశారు. ఐదారు చెరువుల వరద నీరు పారే ఉర్సు చెరువు మత్తడి నాలా పాము మెలికలు తిరిగింది. కేవలం 15-20 అడుగులు ఉంది. వరద నీరంతా సమీపంలోని ప్రైవేటు స్థలాలు, బీఆర్‌నగర్‌లోకి వెళ్తున్నాయి. విస్తీర్ణం తగ్గించండి నాలాల విస్తీర్ణం తగ్గించాలని, నివాస గృహాలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి. వీటిని లెక్క చేయకుండా శుక్రవారం హనుమకొండ నయీంనగర్ నాలా వద్ద కూల్చివేతలు కొనసాగాయి. జవహర్‌నగర్, నయీంనగర్, పెద్దమ్మగడ్డ, కాకతీయ కాలనీ, రంగంపేట, సరస్వతి కాలనీ, పోతననగర్ నాలాల మార్కింగ్‌పై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీభద్రకాళి దేవాలయం వద్ద రంగంపేట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను కలిసి విన్నవించారు. కేఎంజీ పార్కు నుంచి సరస్వతి కాలనీ, రంగంపేట, ములుగురోడ్ వరకు 82 అడుగులకు మార్కింగ్ చేశారని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజల నివాస గృహాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోందని వివరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్ బాషాను కూడా కలిసి వినతి పత్రం ఇచ్చారు.

# ముద్ర పడాల్సిందే!

వరంగల్ : సర్కారు కళాశాలల్లో పని చేసే కొందరు అధ్యాపకులు విధులకు సరిగా రావడం లేదు. వచ్చినా సంతకాలు చేసి వెంటనే బయటకు వెళ్తున్నారు. సమయపాలన పాటించకపోవడం తో బోధన కుంటుపడుతోంది. విధులకు రాకుండా రిజిస్టర్లో సంతకాలు పెడుతూ వేతనాలు పొందుతున్నారు. వీటికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం బోధన, బోధనేతర సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు విధానం ప్రారంభించనుంది. రాష్ట్ర వ్యాప్తంగానుంచి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయి. బయోమెట్రిక్ విధానాన్ని ప్రభుత్వం 2016–17 విద్యా సంవత్సరంలో తీసుకువచ్చింది. కొవిడ్ కారణంగా ప్రత్యక్ష తరగతులు నిలిచిపోయాయి. బయోమెట్రిక్ హాజరు మూలకు చేరింది. వినియోగం లేకపోవడం, కాలపరిమితి ముగియడంతో ఈ వ్యవస్థను గతేడాది



నుంచి పూర్తిగా పక్కన పెట్టారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని కళాశాలల్లో కొత్త యంత్రాలు బిగించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు కేటాయించారు. తొలి విడతగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది వేలిముద్రల నమోదు ఇటీవల పూర్తయింది. నేటి నుంచి వీరంతా బయోమెట్రిక్ హాజరు వినియోగించాలి.

వారం రోజులకు నివేదిక..

ఈ విధానంతో సమయ పాలన మెరుగుపడుతుంది. అందరూ విధులకు వస్తారు. ఎక్కువసార్లు గైర్హాజరయ్యే వారిపై అధికారులు నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తారు. రాకపోవడానికి గల కారణాలను ఆరా తీస్తారు. ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇచ్చేలా చర్యలు చేపడతారు. నెలలో రెండుసార్లు నివేదికలు అధికారులకు పంపుతారు.

సమయానికి రావాలి

బి.గోపాల్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేశాం. అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరుకావాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కూడా ఈ విధానం అమలు చేస్తాం. విధిగా ప్రతి ఒక్కరూ వేలిముద్ర వేయాలి.

# ఇంతింతై అల్లుకునేలా..!

మిర్యాలగూడ : తెలంగాణ ప్రాంతంలో మగ్గం వర్క్ చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పురుషులు వస్తున్నారు. వివిధ రకాల డిజైన్లు రూపొందిస్తూ బొటిక్‌లో వందలాది మంది ఇతర రాష్ట్రాల వారు ఉపాధి పొందుతున్నారు. దీనికి భిన్నంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుపేద మహిళలకు కుట్టుమిషన్ అత్యాధునిక ఎంబ్రాయిడరీ డిజైన్లలో శిక్షణ ఇచ్చి వారు స్వయం ఉపాధి పొందేలా చూడాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మహిళల పాలిట వరంగా మారనుంది. ప్రతి నియోజకవర్గంలో మొదటి దశలో మూడువేల మంది మహిళలను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూత్రప్రాయంగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజక వర్గాల్లో 36 వేల మంది మహిళలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏడాదిలో కొంత కాలం మాత్రమే శిక్షణ ఇచ్చేవి. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సామాజిక సేవ సంస్థల వారికి ఈ శిక్షణల బాధ్యతలు అప్పగించి జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించే వారు. కొవిడ్ కారణంగా ఈ శిక్షణలు తగ్గుముఖం పట్టగా.. శిక్షణలకు ప్రభుత్వ నిధుల కేటాయింపులు సైతం



నిలిచి పోయాయి. కొవిడ్ అనంతరం పరిస్థితులు అనుకూలించటంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి సహకారంతో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళలను ఎంపిక చేసి శిక్షణలు ఇచ్చి ప్రతినెల సగటున రూ. 17వేల వరకు ఒక్కొక్కరిపై ఖర్చుచేసి వారికి అధునాతన కుట్టుమిషన్లు సైతం అందజేయాలని నిర్ణయించారు. శిక్షణ పొందిన వారికి స్థానికంగా ప్రభుత్వ పాఠశాలల్లో సారూప్య దుస్తులు కుట్టే బాధ్యతలు అప్పగించటంతో పాటుగా గురుకులాలు, వసతిగృహాల విద్యార్థుల దుస్తులు కుట్టించనున్నారు.

చురుకైన ప్రతిభ కనబరిచే వారికి డిజైనింగ్‌లో శిక్షణతో ఫ్యాషన్ దుస్తులు కుట్టేలా అవకాశాలు కల్పించనున్నారు. సొంతంగా డిజైనర్ దుస్తులు కుడితే వాటిని మార్కెటింగ్ చేసుకునేలా విక్రయశాలలు సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..- కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, నల్గొండశిక్షణ విషయమై ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో ఉచిత శిక్షణకు ఏర్పాట్లు చేస్తాం. మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఎంతో ఉపయోగ పడటంతో పాటుగా వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

# తునికాకు సేకరణ లక్ష్యం ఖరారు



భూపాలపల్లి: వేసవిలో వేలాది మంది గ్రామీణ కూలీలకు ఉపాధినిచ్చే తునికాకు సేకరణకు అవసరమైన ఏర్పాట్లను అటవీ శాఖ చేపట్టింది. గత ఏడేళ్ల క్రితం కొన్ని తునికాకు యూనిట్లకు గుత్తేదారులు ముందుకు రాని కారణంగా జిల్లాలోని కొన్ని మైదాన ప్రాంత యూనిట్లలో ఆకు సేకరణ చేపట్టకపోవడంతో సుమారు రూ. 10 లక్షల మేరకు కూలీలు ఆదాయాన్ని కోల్పోయారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలవారీగా తునికాకు యూనిట్ల టెండర్లు ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. ఈ నెల 6న మొదటి విడత, రెండో విడత 21, మూడో విడత మార్చి 10వ తేదీల్లో గుత్తేదారులు టెండర్ నోటీసులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకోవాల్సి ఉంటుంది. తునికాకు టెండర్‌ల షెడ్యూల్ తేదీలను ఖరారు చేస్తూ, రెండు రోజుల క్రితం పీసీసీఎస్ నుంచి సీసీఎఫ్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో పరిశీలిస్తే.. అత్యధికంగా తునికాకు యూనిట్లు జయశంకర్ జిల్లాలోనే ఉన్నాయి. జయశంకర్ జిల్లాలోని భూపాలపల్లి, మహదేవపూర్ అటవీ డివిజన్‌లలో మొత్తం 35 యూనిట్లకు 39,400 స్టాండర్డు బ్యాగులు(ఎస్‌బీ) తునికాకు సేకరణ లక్ష్యంగా అటవీ శాఖ నిర్ణయించింది. అదేవిధంగా ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం, ములుగు అటవీ డివిజన్‌లలో మొత్తం 29 యూనిట్లకు 23,800 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా ఈ ఏడాది అటవీ అధికారులు నిర్ణయించారు. ఆకు లభ్యత ఉన్న ఆయా అటవీ ప్రాంతాల్లోని అవకాశాలను బట్టి యూనిట్ల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సేకరించిన ఆకును ఆరబెట్టేందుకు జయశంకర్ జిల్లాలో 231 కల్లాలు, ములుగు జిల్లాలో 328 కల్లాలు ఏర్పాటు చేయనున్నారు. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 559 కల్లాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సారి తునికాకు లభించని ప్రాంతాల్లో కొన్ని యూనిట్లను తగ్గించారు.

ఇ- టెండర్ విధానంతోనే తునికాకు యూనిట్ల టెండర్లు చేపట్టనున్నారు. ఈ విధానంతో గుత్తేదారులు సిండికేట్‌గా మారే అవకాశం ఉండదు. ఈ సీజన్‌లో అటవీ అధికారులు ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు మొదటి విడత, ఈ నెల 21వ తేదీ నుంచి 25 వరకు రెండో విడత, మూడో విడత మార్చి నెల 15, 16 తేదీల్లో తునికాకు యూనిట్లకు టెండర్లు నిర్వహిస్తారు. ఈ మేరకు మూడు విడతల్లో జరిగే టెండర్లలో రెండు జిల్లాలోని అన్ని యూనిట్లు అమ్ముడుపోయేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారులు తెలిపారు. అన్ని యూనిట్లు అమ్ముడుపోతేనే గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి పెరిగే అవకాశాలుంటాయి. మరి కొద్ది రోజుల్లోనే టెండర్లు పొందిన గుత్తేదారులు నాణ్యత గల తునికాకు కోసం ప్రూనింగ్(కొమ్మకొట్టుడు) పనులు కూడా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. 15 వేల మందికి పైగా ఉపాధితునికాకు సేకరణ ద్వారా ఏప్రిల్ చివరి వారం, మేలో నెలన్నర రోజుల పాటు కూలీలకు మంచి ఉపాధి లభిస్తోంది. అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక్కో యూనిట్ పరిధిలో వెయ్యి మంది వరకు కూలీలకు ఉపాధి దొరకనుంది. వ్యవసాయ పనులు లభించని వేసవిలో ఉదయం పూటనే వారు ఇళ్ల నుంచి బయల్దేరి అడవులకు వెళ్లి ఎండ తీవ్రత పెరగక ముందే తునికాకు సేకరించుకుని తిరిగి ఇంటికి వచ్చేస్తారు. మధ్యాహ్నం నీడపట్టున కూర్చుని 50 ఆకుల చొప్పున సమీప గుత్తేదారులు ఏర్పాటు చేసిన కల్లాలకు తీసుకెళ్లి అమ్ముకుంటారు. ఈ లెక్కన వెయ్యి కట్టలు ఉంటే ఒక ఎస్‌బీపై వచ్చే కూలీకి రూ. 1,450 వరకు అందుతుంది. దీని ప్రకారమే 50 ఆకుల కట్టకు ధర రూ. 1.40 పైసలు చొప్పున కూలీలకు చెల్లిస్తారు. గతేడాది అమ్ముడు పోని కొన్ని యూనిట్లలో ఆకు సేకరించిన కూలీలు సమీపంలో తునికాకు యూనిట్ల పరిధిలోని కల్లాలకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చు.

# సర్కారు బడులకు కొత్త కళ..



మెదక్ : అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి, ఉపాధి హామీ నిధులు రూ. 30.62 లక్షలతో పనులు చేపట్టారు. ఇందులో రూ. 9 లక్షలు శౌచాలయాలు, రూ. 4.93 లక్షలు వంట గది, తాగునీటి సదుపాయానికి రూ. 1.06 లక్షలు, విద్యుత్తు పనులకు రూ. 1.61 లక్షలు వెచ్చించారు. డ్యూయల్ డెస్క్‌లను ప్రభుత్వం నేరుగా సరఫరా చేసింది. ఈ పాఠశాలను బుధవారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రారంభించనున్నారు. శివ్వంపేట మండలం పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలలో రూ. 3.54 లక్షలతో పనులు జరిగాయి. ప్రహరీకి రూ. 14.30 లక్షలు, ఇతర వాటికి రూ. 9 లక్షలు వెచ్చించారు. ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డు, సోలారు ప్యానెల్‌ను సమకూర్చనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది బడ్జెట్‌లో ఈ పథకానికి రూపకల్పన చేసి నిధులు కేటాయించారు. జిల్లాలో తొలి విడత జాబితా రూపొందించి, ఆయా శాఖల అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ప్రారంభంలో నిధుల కొరతతో పనులు మందకొడిగా సాగగా, ఆ తర్వాత ఊపందుకున్నాయి. ఎట్టకేలకు 15 బడులను ప్రారంభోత్సవాన్ని సిద్ధం చేశారు. బుధవారం వాటిని షురూ చేయనున్నారు.

ఇబ్బందులు తీర్చేలా..

శిథిల గదులు.. వంట గదులు లేక ఆరుబయటే భోజనం వండటం, ఫర్నిచర్ సౌకర్యం లేక నేలబారు చదువులు, సరిగా లేని శౌచాలయాలు.. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సమస్యలు నెలకొన్నాయి. అప్పుడప్పుడు అరకొర నిధుల మంజూరుతో గదులు, శౌచాలయాల నిర్మాణాలు చేపట్టేవారు. ఈ క్రమంలో సర్కారు బడుల స్థితిగతులను మార్చేందుకు మన ఊరు–మన బడి ద్వారా నిధులను కేటాయిస్తోంది. 12 రకాల పనులు చేపట్టాలని నిర్దేశించారు.

ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు

కాయిదంపల్లి(అల్లాదుర్గం), చిట్కుల్ తండా (చిలప్‌చెడ్), రాజ్‌పేట్, మద్దుల్‌వాయి (హవేలిఘనపూర్), కొల్చారం, ఇబ్రహీంబాద్, నారాయణపూర్ (నర్సాపూర్), గజగట్లపల్లి (చిన్నశంకరంపేట), రత్నాపూర్, పిల్లుట్ల (శివ్వంపేట), పోతరాజ్‌పల్లి, యావాపూర్ (తూప్రాన్), కుకునూర్, మంగల్‌పర్తి (వెల్దుర్తి) ప్రభుత్వ పాఠశాలలు కొత్తరూపు సంతరించుకున్నాయి. బుధవారం చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లిలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, శివ్వంపేట మండలం పిల్లుట్లలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అల్లాదుర్గం మండలం కాయిదాంపల్లిలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రారంభించనున్నారు. ఈ విషయమై డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. పనులు పూర్తయిన చోట నేరుగా రాష్ట్ర కార్యాలయం నుంచే ఫర్నిచర్, ఇతర వస్తువులు రానున్నాయని, 11 బడులకు డ్యూయల్ డెస్క్‌లు వచ్చాయని తెలిపారు.

313 ఎంపిక..

జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలలకు తొలి విడతలో 313 ఎంపిక చేశారు. రెండు కేటగిరీలుగా విభజించారు. రూ. 30 లక్షలలోపువి 256, అంతకంటే తక్కువ మొత్తం ఉన్నవి 57 ఉన్నాయి. పనుల బాధ్యతలను ఇంజినీరింగ్ శాఖలకు అప్పగించారు. మండల స్థాయిలో కేటాయించిన విధంగా అధికారులు పాఠశాలలను సందర్శించి, చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదించారు. ఆమోదం లభించాక పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో గుత్తేదారులకు పనులను అప్పగించారు. ఆయా పాఠశాలల్లో రూ. 30 లక్షలపైగా పనులు చేపట్టే వాటికి మాత్రం టెండర్లను ఆహ్వానించారు. ప్రస్తుతం తొలి విడతగా 15 చోట్ల పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యాయి. మరమ్మతులతో పాటు శౌచాలయాలు, మూత్రశాలలు, నల్లాల బిగింపు, విద్యుత్తు, సంపు నిర్మాణం వంటి పనులు చేపట్టారు.

వివరాలు..

ఎంపికైనవి 313

మంజూరైన నిధులు రూ. 129.39 కోట్లు

గ్రౌండింగ్ అయినవి 254

ప్రారంభానికి సిద్ధం 15

# రెండు ఊళ్లలో.. నకిలీ దందా!

మెదక్ : నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి నిందితులకు జామీన్లు ఇప్పిస్తున్న దందాలో కొత్త విషయాలు వెలుగుచూశాయి. కొన్నేళ్లుగా శివ్వంపేట మండలంలోని చెన్నాపూర్‌తో పాటు పెద్దగొట్టిముక్కలో కొందరు ఇదే సంపాదన మార్గంగా ఎంచుకున్నట్లు తేలింది. తాము చెప్పినట్లు వినకుంటే తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తేవడంతో పెద్దగొట్టిముక్క కార్యదర్శి గతేడాది అక్టోబరులో ఉద్యోగానికి రాజీనామా చేశారు. చెన్నాపూర్‌లో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శి అయిదు నెలల క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. జామీన్లకు ఇష్టమొచ్చినట్లు పత్రాలపై సంతకాలు చేయాలని కోరడంతో పాటు ఇతరత్రా వేధింపులు సర్వసాధారణమని ఒక కార్యదర్శి వివరించారు. జామీన్లకు వినియోగం : చెన్నాపూర్‌కు చెందిన సతీష్ అనే వ్యక్తి ఈ నకిలీ పత్రాలను సృష్టిస్తున్నారని పంచాయతీ పాలకవర్గం ఆరోపించిన విషయం తెలిసిందే. ఇదే విషయమై సతీష్ స్పందించారు. తనకు ఆ దందాతో ఎలాంటి సంబంధం లేదని వివరించారు. సమగ్ర విచారణ చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కలుస్తానని చెబుతున్నారు. చెన్నాపూర్‌లో సాగుతున్న దందాపై సమగ్ర కథనాన్ని అందించడంతో స్థానిక ఎంపీడీవో నవీన్‌కుమార్ విచారణ చేపట్టారు. పత్రికలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ గతంలో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులతో పాటు ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన వారితోనూ ఆయన మాట్లాడారు. నిందితులకు జామీన్లు ఇప్పించేందుకు సిద్ధం చేసిన పత్రాలపై చేసిన సంతకాలు తమవి కావని వారు ఎంపీడీవోకు స్పష్టం చేశారు. సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు.

# ఆసక్తి పెంచేలా.. సృజనకు పదును పెట్టేలా..!

మిర్యాలగూడ : నూతన అవకాశాలను అన్వేషించడం.. ఆధునిక కాలంలో వినియోగం, ప్రాథమిక స్థాయిలో ఆసక్తి పెంచడమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సు నిర్వహణకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయుల నుంచి పరిశోధన పత్రాల దరఖాస్తులను ఎస్‌సీఈఆర్టీ ఆహ్వానిస్తోంది. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరిచుకుని ఏటా ఎస్‌సీఈఆర్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

పాల్గొనేందుకు అర్హతలు.. అంశాలు..

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రైవేటు బీఈడీ, డీఈడీ టీచర్ ఎడ్యుకేటర్లు, ఎన్‌జీవోలు, సైన్స్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వారు ఇందులో పాల్గొనొచ్చు. ఇలాంటి వారు జిల్లాలో పది వేలకు పైగా ఉన్నారు. వీరితో పాటు సైన్స్ ఎడ్యుకేటర్లు, క్షేత్రస్థాయిలో పని చేసే పరిశోధకులు ఉన్నారు. వీరంతా సదస్సును సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ సారి సదస్సుకు సంబంధించి ప్రధాన అంశం 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' కాగా, మరో ఐదు ఉప అంశాలున్నాయి.




వీటి ఆధారంగా ఉపాధ్యాయులు వారి అనుభవాలను పరిశోధన పత్రాల రూపంలో పంపాల్సి ఉంటుంది.

వెయ్యి పదాలకు మించకుండా..


ఆసక్తిగల సైన్స్ ఉపాధ్యాయులు తమ పరిశోధన పత్రాలను గురువారం నాటికి పంపాల్సి ఉంటుంది. వెయ్యి పదాలకు మించకుండా నాలుగు పేజీలలో రాసి పంపాలి. ఆంగ్లం, తెలుగు భాషల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకోవాలి. పీడీఎఫ్ రూపంలో %tgscertmathsscience @gmail.com% అనే మెయిల్ ఐడీకి పంపాలి. పరిశోధన పత్రాలను సమర్పించిన పత్రాలను ఎస్‌సీఈఆన్‌టీ పరిశీలించి ఎంపికైన వారికి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఉత్తమ అంశాలను క్షేత్రస్థాయిలో అమలు పరిచేలా చర్యలు తీసుకుంటారు. సదస్సుకు ఎంపికైన వారికి టీఏ, డీఏ చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి– భరణి కుమార్, జిల్లా సైన్స్ అధికారి, యాదాద్రి భువనగిరి

ఈ అవకాశాన్ని సైన్స్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలి. ఆలోచనలు, అనుభవాలను తెలిపేందుకు భాగస్వాములు కావాలి. సైన్స్ బోధనా విధానంలో మార్పులను తీసుకొచ్చేందుకు ఏటా సదస్సు నిర్వహిస్తున్నారు.

# మారని రాత.. తీరని వెత

నల్గొండ :వారం రోజులక్రితం నల్గొండలోని దేవరకొండ రోడ్డుకు చెందిన షణ్ముఖచారి కడుపులో మంట వస్తుందని ఓ ప్రైవేటు వైద్యుడిని సంప్రదించారు. పరీక్షించిన వైద్యుడు కడుపులో మంట తగ్గడానికి వాల్యూ–20 ఎంజీ మాత్ర వారం రోజులు పరిగడుపున వేసుకోవాలని సూచించారు. కానీ.. ఔషధాల దుకాణ నిర్వాహకుడు వాలిమ్–2 ఎంజీ అనే నిద్ర మాత్రలు ఇచ్చారు. దీంతో బాధితుడు రోజూ ఉదయం ఆ మాత్ర వేసుకుని నిద్రలోకి జారుకుంటున్నారు. మూడు రోజుల తరువాత మరో ప్రాంతంలోని ఔషధాల దుకాణదారుడిని సంప్రదిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జనరల్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ వైద్యులతో పాటు ప్రైవేటు వైద్యులు రెండు వేల వరకు ఉన్నారు. వీరితో పాటు నాలుగు వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీల పేరుతో గ్రామీణ వైద్యులుగా కొనసాగుతున్నారు. వీరిలో 80 శాతం మంది రోగుల కోసం రాసే మాత్రలు, ఇంజెక్షన్లను అర్థం కానటువంటి భాషలో రాస్తారు. మరో 40 శాతం మంది వైద్యుల చేతి రాతలు వారికి సంబంధించిన ఔషధ దుకాణదారులకు మాత్రమే అర్థమవుతాయి. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 2016లో రోగికి అర్థమయ్యేలా పెద్దక్షరాల్లో (క్యాప్టల్ లెటర్స్) రాయాలని అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ.. దీనిని జిల్లాలో ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు చేయట్లేదు. దీంతో రోగులు ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కోవడం




తో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు. అర్థం కానటువంటి రాతలు రాసే వైద్యులకు జరిమానా వేయడం, లైసెన్సులు రద్దు చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో చేతిరాతల్లో వైద్యులు ఏమాత్రం మారడంలేదు.

జరిమానా విధించాలి..

చిలుకూరి పరమాత్మ, డ్రగ్గిస్టు రాష్ట్ర కార్యదర్శి

వైద్యుల చేతి రాతపై 2018 ఆగస్టు 9న అప్పటి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌కు 670 పేజీల లేఖలు పంపారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై న్యాయ స్థానాన్ని కూడా సంప్రదించాం. కొంత మంది వైద్యుల చేతి రాతలు ఫార్మాసిస్టులకు కూడా అర్థం కావడం లేదు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యుల చేతి రాతలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉండాలి. దుకాణదారుడికి వైద్యుల రాత అర్థం కాకుంటే ఏదో ఒక మందు ఇస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..– అన్నిమల కొండల్‌రావు, డీఎంహెచ్‌వో, నల్గొండప్రతి వైద్యుడు క్యాప్టల్ లెటర్‌లోనే మందులు రాయాలి అనే జీవో కూడా ఉంది. ప్రస్తుతానికి దీనిని ఎక్కువ శాతం వైద్యులు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై పలు సమావేశాల్లోనూ చర్చించి సూచనలు చేస్తున్నాం. వైద్యులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.



# బ్రిక్స్‌లో బలమైన సహకారంపై చర్చిస్తాం: మోదీ

బ్రిక్స్ సభ్య దేశాలు భవిష్యత్తులో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి, వ్యవస్థీకృత అభివృద్ధిని సమీక్షించుకోవడానికి జొహాన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న సమావేశం కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఆయన మంగళవారం ఉదయం దిల్లీ నుంచి దక్షిణాఫ్రికాకు పయనమయ్యారు.

ఈ సారి బ్రిక్స్ సమావేశం వివిధ రంగాల్లో సభ్య దేశాల మధ్య బలమైన సహకారానికి సంబంధించిన అజెండాను పరిశీలిస్తుందని వెల్లడించారు. "పేద దేశాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు, బహుళపక్ష వ్యవస్థల సంస్కరణలను చర్చించడానికి బ్రిక్స్ విలువైన వేదికగా మారిందని భావిస్తున్నాను" అని ప్రధాని మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ప్రధాని ఎక్స్ (ట్విటర్)లో ఓ పోస్టు చేశారు. "జొహాన్నెస్‌బర్గ్‌లో జరగనున్న బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికాకు వెళుతున్నాను. బ్రిక్స్-ఆఫ్రికా, బ్రిక్స్‌ప్లస్ సమావేశాలు కూడా జరగనున్నాయి. పేద దేశాల సమస్యలు, ఇతర అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఇది వేదికగా మారింది" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆగస్టు 22- 24 వరకు 15వ బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొంటారు. అనంతరం గ్రీస్ పర్యటనకు వెళ్లనున్నారు. 2019 తర్వాత బ్రిక్స్ దేశాధినేతలు వ్యక్తిగతంగా హాజరవుతున్న తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. ఈ సమావేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గైర్హాజరవుతున్నారు. పుతిన్ బదులు ఆ దేశ విదేశాంగమంత్రి సెర్గీ లవ్రోవ్ సదస్సులో పాల్గొంటారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య సమావేశం జరగనుందా.. లేదా..? అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

# ఎన్నికల యుద్ధానికి రెడీ అవుతున్నారా ?




అమరావతి : రాబోయే ఎన్నికల యుద్ధానికి జగన్మోహన్ రెడ్డి అన్ని విధాలుగా రెడీ అవుతున్నారు. ఈనెలాఖరులోగా నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాలని డిసైడ్ అయ్యారు. అలాగే వచ్చే నెల మొదటివారంలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని అనుకుంటున్నారు. గడపగడపకు వైసీపీ చివరి వర్క్ షాపు నిర్వహించాలని అనుకున్నారు. మంత్రులు, ఎంఎల్ఏల సమక్షంలోనే ఫైనల్ రివ్యూ చేసి పనితీరును చదవి వినిపించాలని జగన్ అనుకుంటున్నారు. దసరా పండుగ నాటికి 175 నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను ఎంపిక పూర్తిచేయాలన్నది జగన్ డెడ్ లైన్ . ఇవన్నీ ఒకవైపు చేస్తునే మరోవైపు విశాఖపట్నంకు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వైజాగ్ లో సీఎంవో కు అవసరమైన భవనాలను శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఎంఎల్ఏల పనితీరుపై జగన్ ప్రతినెల రెగ్యులర్ గా మూడు, నాలుగు మార్గాల్లో సర్వే రిపోర్టులు తెప్పించుకుంటున్నారు. ఐప్యాక్ బృందం చేస్తున్న సర్వేకి అదనంగా పార్టీలో నమ్మకస్తులైన నేతలు, ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా కూడా ఎప్పటికప్పుడు సర్వేలు చేయించుకుంటున్నారు. తనకు ఏకకాలంలో అందుతున్న మూడు సర్వే రిపోర్టులను జగన్ ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లోను కచ్చితంగా గెలవాల్సిందే అని జగన్ పదేపదే చెబుతున్న విషయం తెలిసిందే. ఎంఎల్ఏలు, నేతలు తన ఆలోచనలకు తగ్గట్లుగా నియోజకవర్గాల్లో కష్టపడి పనిచేయాల్సిందే అని ఆదేశించారు. ఒకవైపు సొంతపార్టీ బలంపై సర్వేలు చేయించుకుంటు మరోవైపు ప్రత్యర్థిపార్టీల బలాలు, బలహీనతలపైన కూడా రిపోర్టులు తెప్పించుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలోని బలమైన ద్వితీయ శ్రేణి నేతలతో జగన్ డైరెక్టుగా టచ్ లోకి వెళుతున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. బలమైన ద్వితీయ శ్రేణి నేతలను గుర్తించటం, వాళ్ళతో మాట్లాడి పార్టీలో యాక్టివ్ అయ్యేట్లుగా చూసే బాధ్యతలను చంద్రగిరి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అప్పగించారు. చెవిరెడ్డి కోసం ప్రత్యేకంగా సెంట్రల్ ఆఫీసులో ప్రత్యేకమైన సెటప్ కూడా ఏర్పాటుచేసినట్లు సమాచారం. ఏదేమైనా పార్టీలోని అంతర్గత కలహాలను పరిష్కారంపై దృష్టిపెడుతునే బలోపేతం చేయటానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరి ఈ చర్యల ఫలితం ఎలాగుంటుందో చూడాలి.

# 28న దిల్లీకి తెదేపా అధినేత చంద్రబాబు



అమరావతి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఈనెల 28న దిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రంలో అక్రమ ఓట్ల తొలగింపు వ్యవహారంపై.. దిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన ఫిర్యాదు చేయనున్నారు. ఓట్ల తొలగింపులో 'ఊరూరా ఉరవకొండ' లాంటి ఘటనలు ఉన్నాయని సీఈసీ దృష్టికి తీసుకెళ్లనున్నారు. వైకాపా సానుభూతిపరుల దొంగ ఓట్లు చేర్చడం.. తెదేపా అనుకూల ఓట్లు తొలగించడంపై ఫిర్యాదు చేయనున్నారు. వాలంటీర్ల ద్వారా తెదేపా - వైకాపా అనుకూల ఓట్ల సమాచారం సేకరించి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఎన్నికల సంఘం దృష్టికి ఆయన తీసుకెళ్లనున్నారు. ఓట్ల అక్రమాలపై ఉరవకొండ, పర్చూరు, విజయవాడ సెంట్రల్, విశాఖ తదితర ఘటనల సాక్ష్యాలను సీఈసీకి చంద్రబాబు అందించనున్నారు. తెలుగుదేశం నేతల ఫిర్యాదులను అధికారులు పట్టించుకోవట్లేదనే విషయాన్ని కూడా సీఈసీకి నివేదించనున్నారు. ఏపీలో ఓట్ల జాబితాలో అక్రమాలపై సమాచార సేకరణకు ఇప్పటికే తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. వచ్చిన సమాచారం మొత్తాన్ని క్రోడీకరించి సీఈసీకి తెలుగుదేశం పార్టీ సమర్పించనుంది. అక్రమాలు నివారించటంతో పాటు బాధ్యులైన ప్రతి అధికారిపైనా ఉరవకొండ తరహా చర్యలు తీసుకోవాలని సీఈసీని చంద్రబాబు కోరనున్నారు.

# అప్పు మీద అప్పు.. తాజాగా ఏపీ సర్కార్ చేసిన అప్పు ఎంతంటే?



అమరావతి: ఏపీ ప్రభుత్వం అప్పు మీద అప్పులు చేస్తూనే ఉంది. మంగళవారం వచ్చిందంటే చాలు బాండ్ల వేలంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లలో అప్పులు తీసుకుంటోంది. ఇప్పటికే సర్కార్ దాదాపు 33 వేల 500 కోట్ల రూపాయలు అప్పు రూపంలో తీసుకొచ్చింది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రూ.3 వేల కోట్లు అదనంగా అప్పు చేసింది. ఇప్పుడు తాజాగా మరోమారు వెయ్యి కోట్ల రూపాయలను అప్పుగా తీసుకువచ్చింది. మంగళవారం జరిగిన బాండ్ల వేలంలో వెయ్యి కోట్లను 7.46 శాతం వడ్డీకి 15 సంవత్సరాలకు రుణం సేకరించింది. ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ వద్ద వేస్ అండ్ మీన్స్ కింద ఏపీ ప్రభుత్వం చేబదులు తీసుకుంది. ఈ క్రమంలో ఈ రోజు బాండ్ల ద్వారా సేకరించిన అప్పును తమకు ఇవ్వాల్సిన మొత్తంలో రిజర్వ్ బ్యాంక్ జమ చేసుకోనుంది. మరోవైపు ఆర్థిక శాఖ అధికారులు అప్పు కోసం ఢిల్లీలో కాళ్లు అరిగేలా తిరుగుతున్నప్పటికీ సరైన స్పందన కరువైంది. నేటి వరకూ కేంద్ర ప్రభుత్వం అదనపు రుణ పరిమితికి అవకాశం ఇవ్వని పరిస్థితి. ఎప్పటికప్పుడు వెయ్యి నుంచి రెండు వేల కోట్లు తాత్కాలిక అనుమతులు ఇస్తూ కేంద్రం కాలం గడపుతూ వస్తోంది.

# ఏపీ సర్కార్, సీఆర్డీఏకు హైకోర్టు నోటీసులు



అమరావతి: రాజధాని రైతుల కౌలు చెల్లించే కేసులో సీఆర్డీఏ, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రైతులకు కౌలు చెల్లింపు పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా... రైతుల తరపున సీనియర్ న్యాయవాది ఉన్నమ్ మురళీధర్ వాదనలు వినిపించారు. రైతులకు కౌలు చెల్లించేందుకు జీవో ఇచ్చి.. ఆపై ప్రభుత్వం కౌలు చెల్లించలేదని న్యాయవాది చెప్పారు. ప్రతి ఏడాది మేలో కౌలు చెల్లించే వారని కానీ నేటి వరకు కౌలు చెల్లించలేదని తెలిపారు. మురళీధర్ వాదనలు హైకోర్టు రికార్డు చేసింది. ఈ కేసుకు సంబంధించి సీఆర్డీఏ, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.




ముంబయి: పెరుగుతున్న ఉల్లి ధరలను కట్టడి చేసి, దేశీయంగా సరఫరాను పెంచేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఉల్లి ఎగుమతులపై 40 శాతం సుంకాన్ని విధించింది. దాంతోపాటు జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో దిల్లీలో కిలో ఉల్లిని రూ.25కే సరఫరా చేస్తామని ప్రకటించింది. కానీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం ఉల్లి ధరలో ఎలాంటి మార్పులేదు. ఈ నేపథ్యంలో ఉల్లి ధరలపై మహారాష్ట్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎక్కువ ధరకు ఉల్లి కొనుగోలు చేయలేని వారు కొన్ని నెలలపాటు వాటిని తినకుంటే ఎలాంటి వ్యత్యాసం ఉండదని మహారాష్ట్ర మంత్రి దాదా భూసే వ్యాఖ్యానించారు.

"రూ.10 లక్షల విలువైన కారును ఉపయోగిస్తున్నప్పుడు.. రిటైల్ ధర కంటే రూ.10 - రూ.20 ఎక్కువ ధరకు ఉల్లిని కొనుగోలు చేయొచ్చు. ఒకవేళ పెరిగిన ధరల ప్రకారం ఉల్లిని కొనుగోలు చేసే స్థోమత లేకపోతే.. రెండు, మూడు నెలలు వాటిని తినకుంటే ఎలాంటి తేడా ఉండదు. కొన్నిసార్లు క్వింటాల్ ఉల్లి ధర రూ.200 పలికితే.. మరికొన్ని సందర్భాల్లో క్వింటాల్ ధర రూ.2,000గా ఉంటుంది. ఈ సమస్య గురించి చర్చించి దీనికి పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది" అని దాదా భూసే అన్నారు. మరోవైపు ఉల్లి ఎగుమతులపై కేంద్రం విధించిన 40 శాతం సుంకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం తీరుకు నిరసనగా సోమవారం నాసిక్ జిల్లాలో ఉల్లి వ్యాపారులు వేలాన్ని నిలిపివేశారు. దేశంలో పెద్ద ఉల్లి మార్కెట్ మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఉంది.




కోట్లాది మంది భారతీయులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న చారిత్రక క్షణాలు చేరువయ్యాయి. మరికొద్ది గంటల్లో మన వ్యోమనౌక జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టనుంది. జులై 14న శ్రీహరికోటలోని షార్ ప్రయోగ వేదిక నుంచి రోదసిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3.. బుధవారం (ఆగస్టు 23) సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ కానున్నట్లు ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఈ క్రమంలోనే 40 రోజుల చంద్రయాన్-3 ప్రయాణాన్ని 60 సెకన్లలో చూపిస్తూ PIB (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) ఓ వీడియో రూపొందించింది. ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ను రూపొందించినప్పటి నుంచి షార్ వేదిక వద్ద ప్రయోగం, రోదసిలోకి దూసుకెళ్లడం, భూకక్ష్యలో నుంచి చంద్రుడి కక్ష్యలోకి మారడం వంటివి ఇందులో చూపించారు. చివరగా జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ అడుగుపెట్టినట్లు ఆ వీడియోలో ఉంది. విక్రమ్ ల్యాండర్ కిందకు దిగగానే అందులోని ప్రజ్ఞాన్ రోవర్ జారుకుంటూ బయటకు వచ్చినట్లు ఊహాజనితంగా యానిమేషన్ రూపంలో వీడియోలో చూపించారు. అన్ని అనుకూలిస్తే రేపు సాయంత్రం జాబిల్లి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ కాలుమోపనుంది. ఆ తర్వాత రెండు వారాల పాటు ల్యాండర్, రోవర్ చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు సాగిస్తాయి.

ఈ ప్రయోగం విజయవంతమైతే.. అమెరికా, రష్యా, చైనా తర్వాత జాబిల్లిపై కాలువోపిన నాలుగో దేశంగా భారత్ అవతరించనుంది. ఇక, దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా సరికొత్త చరిత్రను లిఖించనుంది.

# ఆ భూమిని కాజేసేందుకు ఏ2 విజయసాయి కుట్ర.. దానిజోలికి వెళ్లొద్దు



అమరావతి: విశాఖలోని భీమునిపట్నం ప్రాంతం తుర్లవాడ కొండపై 120 ఎకరాలు కాజేసేందుకు ఏ-2 విజయసాయిరెడ్డి కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తుర్లవాడ ఆధ్యాత్మిక క్షేత్రం అని దీని జోలికి రావొద్దని అన్నారు. విజయసాయిరెడ్డి తన కూతురు విద్యా సంస్థల నిర్మాణం కోసం 120 ఎకరాలు కేటాయించాలని జగన్ రెడ్డిని కోరారని.. రూ.300 కోట్ల విలువైన భూమిని విజయసాయిరెడ్డికి బహుమతిగా ఇవ్వడానికి జగన్ రెడ్డి యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తిని జగన్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు దానం చేస్తున్నారని మండిపడ్డారు. కొండపై 120 అడుగుల నరసింహస్వామి విగ్రహం ప్రతిష్టించాలని స్థానికులు టీటీడీని కోరుతున్నారని మాజీ మంత్రి తెలిపారు. ఇప్పటికే టీటీడీ, సింహాచలం ఆస్తులు దోచేశారన్నారు. దేవుడిని టచ్ చేయవద్దని జగన్ రెడ్డిని కోరుతున్నామన్నారు. ఇప్పటికే విశాఖలో జగన్ రెడ్డి అండ్ కో రూ.70 వేల కోట్ల ఆస్తులు దోచుకున్నారని ఆరోపించారు. రుషికొండపై మంత్రి రోజా పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో దోపిడీపై సీనియర్ నేతలు బొత్స, ధర్మాన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విశాఖలో జరుగుతున్న దోపిడీ, అన్యాయంపై మేధావివర్గం మాట్లాడాలని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రుషికొండపై నిర్మాణాలను పడగొడతామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ రెడ్డి దోపిడీ మొత్తం బయటకు తీస్తామని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు.

# లోకేష్ నడుస్తుంటే జగన్మోహన్ రెడ్డి కాళ్లకు నొప్పి




న్యూఢిల్లీ: గన్నవరంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రకు పెద్ద స్పందన వచ్చిందని, వేలమంది ప్రజలు అర్ధరాత్రి దాటినా రోడ్లపైనే ఉన్నారని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ గన్నవరంలో లోకేష్ నడుస్తుంటే జగన్మోహన్ రెడ్డి కాళ్లకు నొప్పి వస్తోందని, గన్నవరంలో వలస నాయకుడిని తీసుకుంది ఎవరని ప్రశ్నించారు. వంశీ టీడీపీ ఎమ్మెల్యే అయితే ఆయనను తీసుకుంది అధికార పార్టీనే కదా అని అన్నారు. ఈరోజు సాయంత్రం గన్నవరంలో జరిగే టీడీపీ సమావేశం 'నభూతో నభవిష్యతి' అనే విధంగా ఉంటుందని రఘురామ అన్నారు.

లోకేష్ మీటింగ్ అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్తారన్నారు. లోకేష్ నాలుగు కిలోమీటర్లు కూడా నడవలేరని అన్నారు... ఏకంగా 4500 కిలో మీటర్లు నడవడానికి సిద్ధమయ్యారని, ఇప్పటికే 2,500 కిలో మీటర్లు లోకేష్ నడిచారన్నారు. దొంగ ఓట్ల నమోదుపై కేంద్ర ఎన్నికల సంఘానికి గతంలో లేఖ రాశానని, దొంగ ఓట్లు నమోదు చేసే అధికారులపై చర్యలు తీసుకునేలా కోర్టులో కూడా పిటిషన్ వేస్తామన్నారు. అలాంటి అధికారులపై ప్రజలు కూడా ఫిర్యాదు చేయాలని రఘురామకృష్ణంరాజు సూచించారు.

# మీరు నిండు నేరుళ్లు ఆరోగ్యంగా ఉండాలి.. చిరుకు చంద్రబాబు బర్త్‌డే విషెస్



హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ట్విట్టర్ వేదికగా చంద్రబాబు చిరుకు బర్త్‌డే విషెస్ తెలిపారు. "స్వయంకృషితో అంచెలం చెలుగా ఎదిగి సినీ అభిమానుల హృదయాలలో చిరంజీవిగా చిరస్థానాన్ని పదిలపరుచుకున్న మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు. సినీ పరిశ్రమ భవిష్యత్తును, సినీ కార్మికుల సంక్షేమాన్ని సదా కోరుకునే మీరు.. నిండు నూరేళ్లు ఆరోగ్య ఆనందాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

## పొట్టి డ్రెస్సులో బుట్టబొమ్మ పరువాలు.. స్టన్నింగ్

గోపికమ్మా చాలును లేమ్మా ఈ నిదురా.. అంటూ గోపిక వేశంతో అందర్నీ ఆశ్చర్య పరిచి బుట్టబొమ్మా.. బుట్టబొమ్మ డ్యాన్స్ తో టాలీవుడ్ ను ఓ ఊపు ఊపిన పూజా హెగ్దే గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్క్ అనే తమిళ సినిమాతో 2012లో సినీ రంగంలో అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ... ఒక లైలా కోసం చిత్రం ద్వారా టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ముకుంద డీజే రంగస్థలం అరవింద సమేత మహర్షి అల వైకుంఠపురంలో వంటి బ్లాక్ బస్టర్ హిట్టు చిత్రాల్లో నటించి తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది. అతి తక్కువ కాలంలోనే తన అందం అభినయంతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఓ వైపు సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు సోషల్ మీడియాల ద్వారా తన అభిమానులకు టచ్ లో ఉంటుంది. తాజాగా ఈ పొడుగు కాళ్ల సుందరి ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ పొట్టి డ్రెస్సులో అదిరిపోయింది. అందాలన్నీ ఆబోస్తూనే కుర్రకారు



గుండెల్లో హీటు పుట్టిస్తోంది. ఎద అందాలు క్లీవేజ్ తో పాటు నడుము ఒంపుసొంపులు థైస్ అందాలను చాలా క్లియర్ గా చూపిస్తోంది. హెయిర్ లీవ్ చేసి స్పెక్స్ చేత పట్టుకొని.. దాని కొన కొరుకుతూ చాలా స్టైలిష్ గా కూర్చుంది. అలాగే డ్రెస్సుకు మ్యాచింగ్ రెడ్ కలర్ పెన్సిల్ హిల్స్ వేసుకొని అందాలను ఆరబోస్తోంది. పడుకొని కూర్చొని సోఫాపై నిల్ డౌన్ చేస్తూ రెచ్చిపోయింది. అసలే అందగత్తె.. ఆపై రెడ్ డ్రెస్సు... విపరీతమైన అందాల ఆరబోత... అబ్బో ఈ ఫొటోలో అమ్మడి అందం గురించి వర్ణించాలంటే కవులు దిగిరావాల్సిందే అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. నీ అందాన్ని తట్టుకోలేక పోతున్నామని హాట్ నెస్ ఓవర్ లోడెడ్ క్యూట్ బ్యూటీ అంటూ చెప్పుకొస్తున్నారు. థైస్ అందాలతో పాటు ఎద అందాలు అదిరాయి అంటూ మరికొంత మంది కామెంట్ల రూపంలో తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. ఈ డ్రెస్సులో పూజ అందాలు అన్నీ కనిపిస్తుండగా... ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్లు చేస్తున్నారు. మీరూ ఓ లుక్కేసేయండి ఈ పొడుగు కాళ్ల సుందరిపై.

## శాకుంతలం కంటే మత్తుగా స్టన్నింగ్ లుక్

స్టార్ హీరోయిన్ సమంత వరుస సినిమాల్లో నటిస్తూ ప్రస్తుతం చాలా బిజీగా గడుపుతున్నారు. ఓ వైపు ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందుతూనే షూటింగ్ లో పాల్గొంది. కొన్నాళ్లు బ్రేక్ తీస్కొని.. తన ఆరోగ్యాన్ని బాగు చేసుకుంది. ఇక అప్పటి నుంచి శాకుంతలం సినిమా ప్రమోషన్ పనులతో బిజీగా మారిపోయింది. ఎప్పటికప్పుడు ఇంటర్వ్యూలు ఇస్తూ... తెగ సందడి చేసింది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా సోషల్ మీడియా వేధికగా కూడా ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత తన ఇన్ స్టా గ్రామ్ వేధికగా ఓ ఫొటో షేర్ చేసింది. అందులో సమంత అచ్చం మత్స్య కన్యలా కనిపిస్తోంది. అందుకు కారణం ఆమె వేసుకున్న ఔట్ ఫిట్ యే. మత్స్యకన్య లా లుక్కిచ్చే బ్లాక్ కలర్ ఔట్



ఫిట్ లో అదిరిపోయింది. పైన బ్లౌజ్ కింద బ్లాక్ కలర్ మిడ్డీ వేసుకుంది. పైనుంచి కిందకు వచ్చే సిరికి కుషించుకుపోయినట్లు కనిపించే ఈ డ్రెస్సులో సామ్ చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. అలాగే బ్లాక్ కలర్ నెయిల్ పాలీష్ బ్లాక్ హీల్స్ వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. మెడలో పాము లాగా ఉన్న ఓ సిల్వర్ జ్యువెల్లరీ చేతికి పాములా చుట్టుకొని ఉన్న రెండు వరుసల బ్రేస్ లేట్ పెట్టుకుంది. ఇయర్ రింగ్స్ కూడా ఇలాంటివే పెట్టుకుంది. ఇందులో సామ్ నడుము అందాలతో పాటు ఒంపుసొంపులు చక్కగా కనిపిస్తున్నాయి. నడుమైతే నయాగారా ఫాల్స్ లా మెలికలు తిరిగి కనిపిస్తోంది. పైన కొప్పు పెట్టుకున్న సామ్.. కొంచెం జుట్టును ముందుకు వేసుకొని అదిరిపోయే లుక్కులో దర్శనం ఇచ్చింది. సామ్ పోస్ట్ చేసిన ఈ ఫొటోలు చూసిన అభిమానులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయావు చాలా అందంగా ఉన్నావు రోజురోజుకూ నీ అందం పెరుగుతోందంటూ చెబుతున్నారు. ప్రస్తుతం సామ్ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె వేసుకున్న జ్యువెల్లరీ మరింత ట్రెండ్ అవుతోంది. సమంత హీరోయిన్ గా నటించిన తాజా చిత్రం శాకుంతలం ఏప్రిల్ 14వ తేదీన విడుదల అయింది. టాలీవుడ్ దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రం డిజాస్టర్ గా నిలిచింది.




# టాలీవుడ్ లో బాలీవుడ్ భామల గుసగుస!




అలియాభట్ టాలీవుడ్ ఎంట్రీతో సీన్ ఏ రేంజ్ లో టర్న్ అయిందో చూస్తూనే ఉన్నాం. 'ఆర్ ఆర్ ఆర్' తో అమ్మడికి ఎనలేని గుర్తింపు దక్కింది. పాన్ ఇండియాలో ఓ వెలుగు వెలిగింది. మళ్లీ మళ్లీ తెలుగు సినిమాల్లో నటించాలి అన్న ఆసక్తిని పెంచింది అలియాభట్. కానీ బాలీవుడ్ కమిట్ మెంట్ల కారణంగా చేయలేని పరిస్థితి. ఆమెని చూసి బాలీవుడ్ నుంచి ఏకంగా స్టార్ హీరోయిన్లే దిగిపోతున్నారు. ఇప్పటికే 'ప్రాజెక్ట్- కె' లో దీపికా పదుకొణే నటిస్తుంది. ఆమెతో పాటు దిశా పటానీ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. రామ్ చరణ్ సరసన 'గేమ్ ఛేంజర్' లో కియారా అద్వానీ నటిస్తుండగా.. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమాతో జాన్వీ ఎంట్రీ ఇస్తుంది.

ఇంకా గేట్లు తెరవాలే గానీ యంగ్ హీరోయిన్లు సారా అలీఖాన్..పరిణితి చోప్రా లాంటి వారు పరిగెత్తుకొచ్చేయాలని చూస్తున్నారు. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాని కూడా తీసుకురావాలని మరోవైపు సీరియస్ ప్రయత్నాలు సాగిస్తున్నాడు ప్రశాంత్ నీల్. ఇలా టాలీవుడ్ లో బాలీవుడ్ భామల వేగం పెరుగుతుంది. వీళ్లందరికీ టాలీవుడ్ నిర్మాతలు అధిక పారితోషికం ఇచ్చి మరీ తీసుకొచ్చారు. బాలీవుడ్ లో చెల్లించే దానికంటే రెండు రూపాయలు ఎక్కువగా ఇచ్చి దిగుమతి చేసారు. ఇక్కడ సినిమా హిట్ అయితే గుర్తింపు తారా స్థాయికి చేరుతుంది! అన్న ఉత్సాహంతోనూ భామలు ఎంట్రీ ఇస్తున్నారు. మొదట్లో ఎందుకులే టాలీవుడ్ కి అనుకన్నా! ఇప్పుడు ఇదే బెటర్ గా ఉందన్న గుసగుస తెరపైకి వస్తుంది. పాపులర్ బ్యూటీలకు ఇక్కడ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. గౌరవ-మర్యాదలు గొప్పగా దక్కుతాయి.

కాస్టింగ్ కౌచ్ లాంటి వి ఉండవు. సినిమా మొదలైన దగ్గర నుంచి ముగించి వెళ్లే వరకూ ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు. ఇక్కడున్నంత కేరింగ్ ఇంకే భాషలోనూ ఉండదు అనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి సమీకరణాలే సొంత పరిశ్రమపై బాలీవుడ్ బామల్లో అసంతృప్తి జ్వాలని రగిల్చినట్లు వినిపిస్తుంది. లోలోపల బాలీవుడ్ పై ఉన్న అక్కసునంతటిని వెళ్లగక్కుతున్నారుట. ఇంతకాలం మంచి వేదికని మిస్ అయ్యాం అనే భావనలో ఉన్నారుట భామలంతా.

# పంథ్ కి పోటీగా జడేజా.. ఊర్వశి నామస్మరణం!





హేట్ స్టోరి 4 బ్యూటీ ఊర్వశి రౌతేలా అందాలకు క్లీన్ బౌల్డ్ కానిది ఎవరు? ముఖ్యంగా టీమిండియా క్రికెటర్లు ఇప్పటికే ఒక్కొక్కరుగా స్టంప్ అవుట్ అయిపోతున్నారు. ఇటీవల ఊర్వశి లవర్ అంటూ రిషబ్ పంత్ పేరు ప్రముఖంగా వినిపించింది. అతడు ఊర్వశి పిలుపు కోసం ఐదు నక్షత్రాల హెూటల్ లాంజ్ లో గంటల కొద్దీ సమయం వెచ్చించాడని కథనాలొచ్చాయి. అనంతరం ఊర్వశి ప్రకటనతో పంథ్ గందరగోళంలో పడ్డాడు. అయితే అభిమానులు మాత్రం ఈ జంట ఎంతో బావుంటుందని కితాబిచ్చేశారు. ఆ తర్వాత మరో యువక్రికెటర్ నసీమ్ షా కూడా ఊర్వశి అందచందాలకు క్లీన్ బౌల్డ్ అయిపోయాడు. ఇంకా ఊర్వశి జాబితాలో పలువురి పేర్లు చేరుతూనే ఉన్నాయి. క్రికెటర్లకు ఊర్వశి పేరును లింకప్ చేయడంతో సోషల్ మీడియాలో తరచుగా చర్చనీయాంశమైంది. తాజాగా ఊర్వశి అందాలకు పడిపోయిన వారి జాబితాలోకి మరో క్రికెటర్ చేరిపోయాడు. టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక న్యూస్ పోర్టల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశిపై తన అభిమానాన్ని దాచుకోలేకపోయాడు. అతడి వ్యాఖ్యలు అప్పటి నుండి సోషల్ మీడియాల్లో వైరల్ గా మారాయి. బాలీవుడ్ నటీమణుల్లో ఎవరు సెక్సీ? అని హెూస్ట్ అడిగినప్పుడు.. జడేజా వెంటనే ఊర్వశి రౌతేలా పేరును ప్రస్తావించాడు. ఈ ప్రకటన ఊర్వశికి క్రికెటర్లలో పెరుగుతున్న క్రేజ్ ను మరింత పెంచింది. రిషబ్ పంత్ వర్సెస్ ఊర్వశి రౌతేలా వివాదం ఇప్పటికీ ముగిసిపోలేదు. పంథ్ ప్రమాదం తర్వాత ఆసుపత్రిలో చేరినప్పటికీ 5 జనవరి 2023న ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్ కి ఊర్వశి చేరుకున్నప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి.

అక్కడ పంత్ గాయానికి చికిత్స పొందుతుండగా తాను ఎందుకు చేరుకుంది? అంటూ ప్రశ్న తలెత్తింది. రౌతేలా దానిపై ఎలాంటి నిర్దిష్ట వివరాలను ప్రస్తావించకపోయినా.. క్రికెటర్ కోసమే ఆస్పత్రికి వచ్చిందన సోషల్ మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఊర్వశి వ్యవహారంపై పంథ్ అభిమానులు మాత్రం సీరియస్ గా స్పందిస్తున్నారు. వరుసగా యువక్రికెటర్లు ఊర్వశి వల్లో పడిపోవడం కొంత కంగారు పెట్టే వ్యవహారమే.

## సాయం సంధ్యలో మయూరం పురి విప్పేను

నిహారిక కొణిదెల వ్యక్తిగత జీవితం.. బ్రేకప్ గురించి నిరంతరం మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ప్రచారాన్ని నిహారిక ఖండించను లేదు.. ఖరారు చేయనూ లేదు. కానీ ఇటీవల సోషల్ మీడియా ఫోటోషూట్లు చూస్తుంటే నిహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇవ్వడం ఖాయమని హింట్ ఇస్తున్నాయి. మునుపటితో పోలిస్తే నిహారిక ఫోటోషూట్లలో గ్లామర్ హంగు పెరిగిందంటూ అభిమానులు గుర్తిస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాల్లో నిహారిక లేటెస్ట్ ఫోటో ఒకటి వైరల్ గా మారింది. ఇందులో ఊదారంగు చీరలో నిహారిక పోర్ట్రెయిట్ సంథింగ్ స్పెషల్ గా ఉందంటూ ఫ్యాన్స్ కితాబిచ్చేస్తున్నారు. గిరజాల జుట్టు ముక్కుకు ముక్కెర ఆభరణాలతో మెగా ప్రిన్సెస్ ఎంతో



ఒద్దికగా కనిపిస్తోంది. సాయం సంధ్యా సమయం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ అందమైన ఫోటోఫ్రేమ్ అద్భుతంగా కెమెరాలో బంధీ అయింది. ఇది అభిమానుల హృదయాల్ని టచ్ చేసింది. సాయం సంధ్యలో మయూరం పురి విప్పినంత అందంగా మెగా ప్రిన్సెస్ కనిపిస్తోందంటూ ఫ్యాన్స్ మైమరిచిపోతున్నారు. వివాహానికి ముందు టాలీవుడ్ లో కథానాయికగా .. నిర్మాతగా రాణించేందుకు నిహారిక చేసిన ప్రయత్నాల గురించి తెలిసిందే. బుల్లితెర హెూస్ట్ గాను నిహారిక అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు మరోసారి మునుపటిలా యాక్టివ్ అవ్వబోతోందంటూ ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. పెళ్లి తర్వాత నటనకు దూరంగా ఉన్న నీహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇచ్చేది ఎప్పుడు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# పవన్ తో డేట్ కి రెడీ..
# మామ్ ఫ్యానిజంపై కుమార్తె..!

స్టార్లను పిచ్చిగా అభిమానించడం కేవలం సామాన్య ప్రజల వరకే పరిమితం కాదు. సినీపరిశ్రమలో సెలబ్రిటీలుగా ఉన్నవారికి కూడా అంతే పిచ్చి. ఒకవేళ డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో అయితే మీకు ఓకే? అని ప్రశ్నించినా దానికి నిర్మొహమాటంగా తమ ఫేవరెట్ హీరో గురించి ఓపెనవ్వడమే కాదు.. డేట్ కి వెళ్లేందుకు సిద్ధమేనని చెప్పేందుకు వెనకాడరు. గత కొన్నేళ్లుగా కుమార్తె సుప్రీతతో కలిసి సోషల్ మీడియా ఫోటోషూట్లు వీడియో షూట్లతో చెలరేగుతున్న సహాయనటి సురేఖావాణి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కి వీరాభిమాని అన్న సంగతి ఎవరికీ తెలియదు. తాజా ఇంటర్వ్యూలో మామ్ అండ్ డాటర్ పవర్ స్టార్ పై ఉన్న అభిమానం గురించి ప్రస్థావించారు.



ఒకవేళ మీ అమ్మ గారు డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో వెళతారు? అని ప్రశ్నించగా సుప్రీత దానికి సమాధానమిచ్చారు. నిరభ్యంతరంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అంటే అమ్మకు అభిమానం. ఆయనతో డేట్ కి వెళ్లేందుకు అభ్యంతరం లేదు.. కింగ్ నాగార్జున అన్నా అంతే అభిమానం.. అని మమ్మీ మనసులో మాటను వెల్లడించింది. దానిని సురేఖావాణి తనవైన హావభావాలతో కన్ఫామ్ చేసారు. వంద ముద్దులు పెట్టాల్సి వస్తే ఏ హీరోకి? అని ప్రశ్నించగానే పవన్ కల్యాణ్ అంటూ చెప్పారు సురేఖ. డేటింగ్ అంటే ఒక వ్యక్తి కోసం కొంత విలువైన సమయం వెచ్చించడం.. అభిరుచులను షేర్ చేసుకోవడం.. అంతవరకే ఇమాజినేట్ చేయాలి. అంతకుమించి డేటింగ్ పై నానార్థాలు తీయకూడదు. తాము అభిమానించే తారలతో డేట్ కి వెళ్లడం ఫోటోలు లేదా సెల్ఫీలు దిగడం సర్వసాధారణమైన ప్రక్రియ. జనరేషన్ గ్యాప్ తో దీనిని అర్థం చేసుకునే విధానం కూడా మారిపోతోంది. పవన్ కల్యాణ్ - నాగార్జున సురేఖావాణి ఫేవరెట్ హీరోలు. అందుకే వీళ్లతో డేటింగుకి ఓకే అన్నమాట! ఇక కుమార్తెను కథానాయికగా తీర్చిదిద్దేందుకు సురేఖావాణి ప్రయత్నిస్తున్నారని కథనాలొస్తున్నాయి.



# సీఎం కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాలు బేజారు : మంత్రి హరీశ్ రావు

మెదక్ : సీఎం కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేపు మెదక్‌లో సీఎం కేసీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మంత్రి మీడియాతో మాట్లాడారు. మెదక్ వేదికగా రేపు సీఎం కేసీఆర్ ప్రగతి శంఖారావం పూరిస్తారు. బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన తర్వాత మొదటి సభ నూతన ఉత్సాహంతో సభ జరుగనుందని పేర్కొన్నారు.

**కేసీఆర్ వ్యూహానికి కకావికలం..** కేసీఆర్ వ్యూహాన్ని ఎవరూ ఊహించలేదు. ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనతో విపక్షాలు కకావికలం అవుతున్నాయి. మెదక్‌లో పదికి పది సీట్లు పక్కా గెలిచి సీఎం కేసీఆర్‌కు గెలుపు బహుమతిగా ఇస్తామని స్పష్టం చేశారు. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నా, వారిని ఆదుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. టేకేదార్లకు కూడా పింఛను ఇచ్చే కార్యక్రమం సీఎం కేసీఆర్ మెదక్ వేదికగా ప్రారంభిస్తారు. అలాగే దివ్యాంగులకు పెంచిన రూ.4016 పింఛన్లు కూడా అందిస్తారని, అనంతరం మధ్యాహ్నం 3గంటల బహిరంగ సభకు హాజరవుతారని చెప్పారు.

**బీఆర్ఎస్‌కు బీజేపీకి ఉన్న తేడా అదే..** బీఆర్ఎస్ పాలనలో మెదక్ రూపు రేఖలు మారాయి. ఏ రాజకీయ పార్టీ కూడా ఒకే సారి ఇంత పెద్ద మొత్తంలో సీట్లు ప్రకటించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్లకు లీడర్లు లేరు, బీజేపీ వాళ్లకు కేడర్ లేదు. యువత, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున జై కొడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే గులాబీ జెండా ఎగరాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ పథకాలను బీజేపీ కాపీ కొట్టి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నదని చెప్పారు.

కుల వృత్తులకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించే పథకాన్ని కూడా కేంద్రం కాపీ కొట్టిందని గుర్తు చేశారు. మనం పూర్తిగా ఉచితంగా లక్ష రూపాయలు అందిస్తే, కేంద్రం లోన్ల రూపంలో ఇస్తుందట. బీఆర్ఎస్‌కు బీజేపీకి ఉన్న తేడా ఇదేనన్నారు.

**సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన..** అంతకుముందు అధికారులతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. బుధవారం సీఎం కేసీఆర్ మెదక్ జిల్లా పర్యటన నేపథ్యంలో మంత్రి హరీశ్ రావు స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మెదక్ సమీకృత కలెక్టరేట్, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి పోలీసు, ఆర్ అండ్ బీ, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. బహిరంగ సభకు ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.




# తుమ్మల భవితవ్యం ఏంటో.. కాంగ్రెస్ ఇచ్చిన ఆఫర్ ఏంటంటే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కీలక నేతలుగా ఉన్న మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుకు టికెట్లు దక్కకపోవడం పట్ల జిల్లా రాజకీయాల్లో చర్చ జరుగుతోంది. ఈసారి పాలేరు నుంచి మాజీమంత్రి తుమ్మలకు అవకాశం కచ్చితంగా ఉంటుందని, సర్వేల్లోనూ ఆయనకే మొగ్గు ఉందన్న ప్రచారం జరిగింది. కానీ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన కందాల ఉపేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించడంతో పాలేరు టికెట్‌పై ఆశపెట్టుకున్న తుమ్మల భవితవ్యం ఏంటా అన్న చర్చ జరుగుతోంది. ఆయకు సీఎం కేసీఆర్ ఎలాంటి భరోసా ఇస్తారన్నది వేచి చూడాల్సిందే. అయితే తుమ్మల తమ పార్టీలో చేరితే పాలేరు లేదా ఖమ్మం నుంచి బరిలో దింపుతామని కొందరు కాంగ్రెస్ నేతలు ఆఫర్లు ఇస్తుండగా.. తుమ్మల మాత్రం తాను బీఆర్ఎస్ నుంచే పోటీ చేస్తానన్న ధీమాతో ఇప్పటి వరకు వేచి చూశారని చర్చించుకుంటున్నారు. అయితే ఇటీవల పలు కార్యక్రమాల్లో పాల్గొన్న తుమ్మల పాలేరులో తాను పోటీ చేయడం ఖాయమని, గోదావరి జలాలతో పాలేరును సస్యశ్యామలం చేస్తానని ప్రకటించారు. కానీ బీఆర్ఎస్ జాబితాలో ఆయనకు చోటు లేకపోవడంతో ఆయన భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై ఊహాగానాలు నడుస్తున్నాయి. కేసీఆర్ ఇచ్చే భరోసాతో తుమ్మల నిర్ణయం ముడిపడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. తనకు కొత్తగూడెం అభ్యర్థిత్వం దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ధీమా వ్యక్తం చేశారు. కానీ ఆయనకు చోటివ్వకపోవడంతో కాంగ్రెస్ వైపు చూస్తారన్న ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటికే కొత్తగూడెం టికెట్ విషయంలో కాంగ్రెస్‌నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రంగంలో ఉండటంతో.. ఒకవేళ పొంగులేటి పాలేరు లేదా ఖమ్మం వైపు వస్తే జలగం వెంకటరావు కాంగ్రెస్‌లో చేరి కొత్తగూడెం అభ్యర్థిగా రంగంలోకి దిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఈ విషయమై జలగం ఎలాంటి వ్యాఖ్యలు చేయడంలేదు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి తుమ్మల, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుల నిర్ణయం కోసం జిల్లా రాజకీయవర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఇదిలా ఉండగా ఖమ్మంలో మాజీ మంత్రి తుమ్మల అభిమానుల సమావేశం స్థానికంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్ హాల్?లో సమావేశం జరుగుతున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో జరిగిన అభిప్రాయ సేకరణ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఎదుట ఉంచుతామని, తుమ్మల నాగేశ్వరరావు బాటలోనే నడుస్తామని అనుచరుల స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్‌కు భారీగా తరలి వెళ్లి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కలిసే యోచనలో ముఖ్య నాయకులు ఉన్నట్లు తెలిసింది.




# భారాస టికెట్ల కేటాయింపు.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత కౌంటర్

హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా భారాస ప్రకటించిన టికెట్లపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కౌంటర్ ఇచ్చారు. "మహిళా రిజర్వేషన్లపై కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా 2 సార్లు మోసం చేసింది. సంఖ్యాబలం ఉన్నా భాజపా మహిళా బిల్లును ఎందుకు ఆమోదించట్లేదు? చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల బిల్లును భాజపా తీసుకురావాలి.

చట్టం ఉన్నందునే స్థానిక సంస్థల్లో 14 లక్షల మంది మహిళలకు ప్రాతినిధ్యం దక్కింది. మీ రాజకీయ అభద్రతను మహిళా ప్రాతినిధ్యానికి ముడి పెట్టొద్దు" అంటూ కవిత మండిపడ్డారు.

**కిషన్ రెడ్డి ఏమన్నారంటే..? :** రాష్ట్రంలో రోజురోజుకు భాజపాకు పెరుగుతున్న ఆదరణతో ముఖ్యమంత్రి కేసీఆర్‌లో ఆందోళన మొదలైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారాస విడుదల చేసిన అభ్యర్థుల జాబితా చూస్తుంటే ఈసారి అధికారంలోకి రాలేమని సీఎం కేసీఆర్‌కు అర్థమైనట్లు ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. " మెజారిటీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ సీట్లు ఇవ్వడం ద్వారా సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. భాజపా భయంతోనే గజ్వేల్‌తోపాటు ఉత్తర తెలంగాణలోని కామారెడ్డిలో పోటీ చేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ దీక్షలు చేసిన వారు తెలంగాణలో 7 స్థానాలు మాత్రమే మహిళలకు ఇచ్చారు. 33 శాతం అంటే ఏడు సీట్లేనా?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.




జనగామ: స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ తనకే వస్తుందని ఆశించి భంగపాటుకు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజయ్య కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం తన మద్దతుదారులతో సమావేశమై రాజయ్య తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తీవ్ర మనోవేదనతో కన్నీరు పెట్టుకున్నారు. జనగామలో అంబేద్కర్ విగ్రహం దగ్గర వర్షంలోనే తడుస్తూ కాసేపు మౌనదీక్ష చేశారు. అంబేద్కర్ విగ్రహం ముందుకు పడుకుని విలపించారు. ఆ తరువాత తన వద్దకు వచ్చిన కార్యకర్తలపై పడి ఎమ్మెల్యే ఏడ్చేశారు. అందరూ సంయమనం కోల్పోకుండా ఓపికతో పనిచేయాలని రాజయ్య సూచించారు. కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని తెలిపారు. 2001 నుంచి ఇప్పటి వరకూ కేసీఆర్‌ను ఒక్క మాట కూడా అనలేదన్నారు.

**తూచా తప్పకుండా పనిచేస్తాను..** "కేసీఆర్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి రమ్మంటే ఆయన చెప్పిన మాట విన్నాను. నీ స్థాయికి తగ్గట్టుగా నీకు అవకాశం ఇస్తాను అని మాట ఇచ్చారు. అధినాయకుడు ఇచ్చిన మాట ప్రకారం అందరం కలిసికట్టుగా బీఆర్ఎస్ పార్టీలో పనిచేయాలి. అధినాయకుడు చెప్పినట్లుగా ఏ పని చెప్పినా తూచా తప్పకుండా పనిచేస్తాను" అంటూ ఎమ్మెల్యే రాజయ్య వెల్లడించారు.

**రాజయ్య సతీమణి స్పందన...** బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో ఎమ్మెల్యే రాజయ్య సతీమణి ఫాతిమా మేరీ స్పందించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తాము ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోబోమన్నారు. పదవి అనేది ముళ్ల కిరీటంగా చెప్పుకొచ్చారు. ఒక కుటుంబంలో అందరికీ న్యాయం చేయాలని కేసీఆర్ చూసినట్టున్నారన్నారు. కేసీఆర్ నిర్ణయాన్ని వ్యతిరేకించమని... కడియం కోసం ప్రచారం చేస్తామని రాజయ్య సతీమణి ఫాతిమా మేరీ వెల్లడించారు. కాగా.. సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ జాబితాలో రాజయ్యకు చోటు దక్కలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ రాజయ్యకు కాకుండా కడియం శ్రీహరికి ఇస్తూ బీఆర్ఎస్ అధినేత నిర్ణయం తీసుకున్నారు. దీంతో టికెట్ ఆశించిన రాజయ్యకు భంగపాటు తప్పలేదు.

# విశ్వనగరం మత్తు పదార్థాలకు అడ్డాగా మారింది

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. ఏం ట్వీట్ చేశారంటే.. "విశ్వనగరం చేశానని కేసీఆర్ గప్పాలు కొట్టే మన హైదరాబాద్... బీఆర్ఎస్ పాలనలో గంజాయికి, మత్తు పదార్థాలకు అడ్డాగా మారింది. నిన్న సింగరేణి కాలనీలో, నేడు మీర్‌పేటలో ఆడబిడ్డలపై అఘాయిత్యాలు కలచివేస్తున్నాయి. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని ప్రజల మానప్రాణాలను గాలికి వదిలేశారు. ఇలాంటి పాలనపై "తిరగబడదాం – తరిమికొడదాం". అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. మీర్‌పేటలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. కొందరు యువకులు ఇంట్లోకి దౌర్జన్యంగా వెళ్లి బాలికను ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితులను



కఠినంగా శిక్షించాలంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు ఆందోళనలు చేపట్టారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




తిరుమల: భారాస టికెట్ల కేటాయింపుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మరోసారి స్పందించారు. సోమవారం తాను పార్టీ గురించి మాట్లాడలేదని.. తన వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించానని చెప్పారు. తిరుమలలో మరోసారి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వెళ్లాక తన కార్యాచరణ వెల్లడిస్తానని మైనంపల్లి తెలిపారు. "నాకు నా కుమారుడే ముఖ్యం. జీవితంలో నేను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. నన్ను ఇబ్బంది పెడితే కచ్చితంగా నేనూ బదులిస్తా. మెదక్, మల్కాజిగిరి కార్యకర్తలే నాకు ప్రాధాన్యం. నేను ఏ పార్టీనీ విమర్శించను. పార్టీలకు అతీతంగా ఉంటా. మా అబ్బాయికి టికెట్ ఇస్తే.. గెలిపించుకుని వస్తా" అని మైనంపల్లి హన్మంతరావు అన్నారు. తనకు మల్కాజిగిరితో పాటు తన కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇస్తేనే భారాస తరఫున పోటీ చేస్తానని.. లేకుంటే స్వతంత్రంగా బరిలోకి దిగుతానని సోమవారం మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి హరీశ్‌రావు మెదక్‌లో పెత్తనం చెలాయిస్తున్నారంటూ ఆయన తీవ్ర విమర్శలు చేశారు. అవసరమైతే హరీశ్‌పై పోటీ చేస్తానని పేర్కొన్నారు.

కొవిడ్ సమయంలో తన కుమారుడు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజాసేవ చేశాడన్నారు. అయితే మైనంపల్లికి మల్కాజిగిరి టికెట్ ఖరారు చేసిన భారాస.. మెదక్ టికెట్‌ను మాత్రం ఆయన కుమారుడికి ఇవ్వలేదు. అక్కడ మాజీ ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డికి టికెట్‌ను కేటాయించింది. మరోవైపు హరీశ్‌రావుపై మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి మైనంపల్లి స్పందించారు.

# కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే కాంగ్రెస్




నల్గొండ: ఉచిత కరెంటును వ్యతిరేకించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని, డబ్బుల కోసం మద్యం టెండర్లు మూడు నెలల ముందే వేశారని, తెలంగాణలో కేసీఆర్‌ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ ఎంపీ, టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు ఈసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ఏం చేసిందో ఆయనకు తెలియదా.. అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే కాంగ్రెస్ అని.. శ్రీశైలం, కల్వకుర్తి, శ్రీరాంసాగర్ లాంటి ఎన్నో ప్రాజెక్టులను కాంగ్రెస్ పూర్తి చేసిందన్నారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ అభివృద్ధి కోసం కొట్లాడింది తామేనన్నారు. ఎస్ఎల్‌బీసీని అటకెక్కించారని విమర్శించారు. ఈ పదేళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 1వ తేదీన పెన్షన్‌లు ఇచ్చామని, కేసీఆర్‌లాగా 15వ తేదీన ఇవ్వలేదని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: మంత్రి ఎర్రబెల్లి

యాదగిరిగుట్ట: ఎవరెన్ని చేసినా, ప్రతిపక్షాలు తలకిందులుగా పొర్లుదండాలు పెట్టినా, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరేనని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజలు సుఖ శాంతులతో ప్రశాంతంగా జీవించాలంటే, కేసీఆర్ మరోసారి సీఎం కావాల్సిందేనని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆయన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందించారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. భగవంతుడి చల్లని చూపు, కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ప్రార్థించానన్నారు. లక్ష్మీనర్సింహా స్వామి దీవెనలు అందరిపైనా ఉంటాయని, మహిమాన్వితమైన దేవాలయానికి మెరుగులు దిద్ది, నభూతో న భవిష్యతి అన్న చందంగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం, పార్టీ, ప్రభుత్వంపై దేవుడి దీవెనలుంటాయన్నారు. శాంతియుత ఉద్యమం ద్వారా తెలంగాణను సాధించిన కేసీఆర్.. ముఖ్యమంత్రి అయ్యాకే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. సీఎం కేసీఆర్,



బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు మెచ్చారని, ఇంత జనరంజకంగా, ప్రజోపయోగంగా పరిపాలన చేసిన సీఎంలు గతంలో రాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో మళ్లీ రావాలని, ప్రజలు ప్రశాంతంగా జీవించాలని తాను కోరకున్నట్లు తెలిపారు.

# మీర్‌పేట ఘటన.. 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని గవర్నర్ ఆదేశం

హైదరాబాద్: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందనవనం కాలనీలో 16ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనపై తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆరా తీశారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన గవర్నర్... 48గంటల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీ, రాచకొండ సీపీని ఆదేశించారు. రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రతినిధులు తక్షణమే బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబానికి అవసరమైన సహాయ.. సహకారాలు అందించాలని గవర్నర్ ఆదేశించారు.

**ఏం జరిగిందంటే? :** 16 ఏళ్ల ఎస్సీ బాలికపై గంజాయి మత్తులో ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ లాల్‌బజార్‌కు చెందిన బాలిక(16) తల్లిదండ్రులిద్దరూ గతంలో చనిపోవడంతో 15 రోజుల క్రితం తన సోదరుడి(14)తో కలిసి మీర్‌పేటలోని ఓ కాలనీకి వచ్చారు. సమీప బంధువైన అక్క దగ్గర ఆశ్రయం పొందుతున్నారు. బాలిక దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. తమ్ముడు ఫ్లెక్సీలు కట్టే పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం 9 గంటలకు బాలిక తన సోదరుడు, మరో ముగ్గురు చిన్నారులతో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో ఎనిమిది మంది నిందితులు ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న ఆ బృందంలోని నలుగురు బాలిక మెడపై కత్తిపెట్టారు. భవనంలోని మూడో అంతస్తులోకి తీసుకెళ్లారు. మిగిలినవారు ఆమె తమ్ముడితోపాటు అక్కడే ఉన్న చిన్నారుల్ని బెదిరించారు. పైకెళ్లిన నిందితుల్లో ముగ్గురు బాలికను కత్తితో బెదిరిస్తూ ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో పరారైనట్లు బాలిక బంధువులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com